వంద కోట్ల అభివృద్ధి



వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ

ఏడాదిలో 1 ఏం చేశారు?

కష్టపడే నాయకుడిగా ఆయనకు పేరు. నిరంతరం జనంలోనే ఉంటారు. చదివింది అయిదో తరగతే అయినా అన్ని అంశాలపై లోతైన అవగాహన గల చురుకైనవాడు. యుక్తవయసులో చెన్నై వెళ్ళి వ్యాపారంలోకి దిగి ఆర్థికంగా వృద్ధిలోకి వచ్చారు. వెంకటగిరి శాసనసభ్యుడిగా మూడోసారి గెలిచిన కురుగొండ్ల రామకృష్ణ వెంకటగిరి నియోజకవర్గం కోసం ఏం చేస్తున్నారు? తొలి ఏడాది ఏం చేశారు? మలి ఏడాది లక్ష్యాలుగా ఏమి పెట్టుకున్నారు? వెంకటగిరి ప్రోగ్రెస్ రిపోర్ట్...

- 6వ పేజీలో

వేలి ముద్ర వేయాల్సిందే



- అన్ని లాడ్జీలు, హోం స్టేలు, హోటళ్లలో త్వరలో పరికరాల ఏర్పాటు
- గదులు పొందే నేరస్థుల గుర్తింపుకోసం పోలీసుల వినూత్న విధానం

ఎక్కడో హత్యలు చేస్తారు. ఎక్కడో నేరాలకు పాల్పడతారు. తిరుపతిలో ఆశ్రయం పొందుతారు. ఇలా ఎక్కడప డితే అక్కడ నేరస్థులు తప్పుడు వివరా లిచ్చి దర్జాగా తలదాచుకునే పరిస్థితి లేకుండా పోలీసులు వినూత్న విధా నాన్ని తీసుకొస్తున్నారు. లాడ్జీల్లో వేలి ముద్ర వేస్తేనే గదులిచ్చేలా చర్యలు చేపడుతున్నారు.

తిరుపతి(నేరవిభాగం), జూలై 14 (ఆంధ్రజ్యోతి): తిరుపతి ఆధ్యాత్మిక క్షేత్రం కావడంతో దేశ విదేశాల నుంచి శ్రీవారి దర్శనం కోసం రోజూ వేలాది మంది వస్తుంటారు. అదే సమయంలో కొన్ని అసాంఘిక శక్తులూ వచ్చి తలదాచుకుం టున్నాయి. ఇప్పటి వరకు ఆధార్, చిరునామా తీసుకుని బయటి వారికి గదులు ఇస్తున్నారు. దీనివల్ల కొన్ని ఫలితాలున్నా.. పలు హోటళ్లు, లాడ్జీలు, హోంస్టేలలో తూతూమంత్రంగా అమలు చేస్తున్నారు. దీంతో ఎస్పీ హర్షవర్ధనరాజు జిల్లాలోని అన్ని వసతి సముదాయాల్లో ఆన్‌లైన్ విధానం అమలుకు చర్యలు తీసుకున్నారు. అన్ని హోటళ్లు, లాడ్జీలు, హోంస్టేల కాంటాక్టు నెంబర్లు తీసుకుని వాటిని పోలీసు యాప్‌తో అనుసంధానం చేస్తున్నారు. ఇప్పటికి 261 హోంస్టేలు, 304 లాడ్జీలను ఆన్‌లైన్ చేశారు. మిగిలిన వాటినీ త్వరలో ఆన్‌లైన్ చేయనున్నారు. ఇక, గదులు దిగే వారి అడ్రస్‌లు, కాంటాక్టు నెంబర్లు కూడా పోలీసు యాప్‌తో అనుసంధానమయ్యేలా చూస్తు న్నారు. అన్ని హోటళ్లు, లాడ్జీలు, హోం స్టేలలో వేలిముద్రల డివైజర్లను నాలుగు నెలల వ్యవధిలో అందుబాటులో ఉంచనున్నారు. ఆ తర్వాత నుంచి వేలిముద్ర వేస్తేనే గదులు ఇవ్వనున్నారు. ఈ ప్రక్రియను పోలీసు కమాండ్ కంట్రోల్‌తో అనుసంధానం చేస్తారు. దీంతో గదుల కోసం వేలి ముద్ర వేసిన వారిలో నేరస్థులుంటే.. వారి నేర చరిత్ర తెలుసుకోవడానికి వీలవుతుంది. ఏ గదిలో ఎవరు.. ఎంతమంది.. ఏప్రాంతానికి చెందిన ఉంటున్నారనే వివరాలూ తెలుసుకోవచ్చు. ఇది అమలైతే నేరాలు, అసాంఘిక కార్యక్రమాలు తగ్గుముఖం పట్టే అవకాశాలు ఉన్నాయని ఎస్పీ ఆశాభావం వ్యక్తం చేశారు.



కేంద్రమంత్రి పీయూష్ గోయల్ నుంచి అవార్డు అందుకుంటున్న కలెక్టర్ వెంకటేశ్వర్

చేనేత-హస్తకళల్లో జిల్లాకు మొదటి బహుమతి

- కేంద్రమంత్రి నుంచి అవార్డు అందుకున్న కలెక్టర్ వెంకటేశ్వర్
- వెంకటగిరి పట్టుచీరకు జాతీయ గుర్తింపు

తిరుపతి(కలెక్టరేట్), జూలై 14(ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయిలో చేనేత, హస్తకళల విభాగంలో (వెంకటగిరి పట్టుచీరలకు) జిల్లాకు ప్రథమ బహుమతి లభించింది. కేంద్రప్రభుత్వం నిర్వహించిన ఓడీఓపీ (వన్ డిస్ట్రిక్ వన్ ప్రొడెక్ట్) జాతీయ అవార్డుల ప్రదానోత్సవంలో ఢిల్లీలోని భారత మండపం(ప్రగతిభవన్)లో నిర్వహించిన కార్యక్రమంలో కేంద్ర మంత్రి పీయూష్‌గోయల్, సీఎం రేఖ గుప్తా చేతుల మీదుగా మొదటి బహుమతి (బంగారు కేటగిరి)ని కలెక్టర్ వెంకటేశ్వర్ సోమవారం అందుకున్నారు. 'జిల్లాలో ఓడీఓపీ కింద ప్రోత్సహిస్తున్న వెంకటగిరి పట్టుచీరలు, స్థానికంగా చేనేత ఉత్పత్తుల వైశిష్ట్యం, నాణ్యత, గౌరవానికి జిల్లాకు మొదటి బహుమతి రావడం ఆనందంగా ఉంది. ఇలాంటి పురస్కారాలు కళాకారులను ప్రోత్సహించేలా ఉంటుంది. వారి జీవనోపాధికి భరోసా కల్పిస్తుంది. వెంకటగిరి చీరలకు జాతీయస్థాయి గుర్తింపు రావడం, ప్రాంతీయ కళాకారుల ప్రతిభను వెలుగులోకి తీసుకొచ్చే అవకాశాన్ని కలిగించింది' అని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కేంద్రమంత్రి జితిన్ ప్రసాద్, రాష్ట్ర మంత్రి సవిత, జిల్లా చేనేత అధికారి రాచపూడి రమేష్ పాల్గొన్నారు.

నేటి నుంచి లెక్చరర్ పోస్టులకు పరీక్షలు

తిరుపతి(కలెక్టరేట్), జూలై 14 (ఆంధ్రజ్యోతి): ఏపీపీఎస్సీ ఆధ్వర్యంలో వివిధ లెక్చరర్ పోస్టులకు మంగళవారం నుంచి పరీక్షలు నిర్వహిస్తున్నట్టు డీఆర్వో నరసింహులు తెలిపారు. కలెక్టరేట్‌లో సంబంధిత శాఖ అధికారులతో సోమవారం ఆయన సమీక్షించారు. ఈ నెల 23వ తేది వరకు ఆరు కేంద్రాల్లో.. ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్లలో ఈ పరీక్షలు జరుగుతాయన్నారు. 6,412మంది హాజరవుతున్నట్లు తెలిపారు. పరీక్షా కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించాలని ఆదేశించారు.

వైఎస్సార్ స్పోర్ట్స్ స్కూల్ ఎంపికకు 16మంది బాలబాలికలు హాజరు



బాలబాలికలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

తిరుపతి(క్రీడలు), జూలై 14(ఆంధ్రజ్యోతి): డాక్టర్ వైఎస్సార్ స్పోర్ట్స్ స్కూల్ ఎంపికలకు ఈనెల 11, 14 తేదీల్లో తిరుపతి అర్బన్, రూరల్, శ్రీకాళహస్తి, గూడూరు, సూళ్లూరుపేట, సత్యవేడు, తడ నుంచి 16 మంది హాజరయ్యారు. వీరిలో ఐదుగురు బాలికలు, 11 మంది బాలురు ఉన్నారు. తిరుపతిలోని ఎస్వీయూ మైదానంలో డీఎస్‌డీవో శశిధర్ ఆధ్వర్యంలో డీఎస్ఏ కోచ్‌లచే వీరికి ఆరు ఈవెంట్లలో బ్యాటరీటెస్టులు నిర్వహించారు. అనంతరం ప్రభుత్వ వైద్యులు వైద్యపరీక్షలు చేశారు. ఈ నివేదికను వైఎస్సార్ స్పోర్ట్స్ స్కూల్ యాజమాన్యానికి పంపారు. అక్కడ నివేదికను పరిశీలించి డాక్టర్ వైఎస్సార్ స్పోర్ట్స్ స్కూల్లో 4, 5వ తరగతుల ప్రవేశానికి అర్హుల జాబితాను ఆన్‌లైన్‌లో పొందుపరచనున్నారు.

అరక్కోణం ఎర్రచందనం స్మగ్లర్‌పై పీడీ యాక్టు

తిరుపతి, జూలై 14 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎర్రచందనం అక్రమ రవాణా దందా సాగిస్తున్న తమిళనాడు రాష్ట్రం అరక్కోణం ప్రాంతానికి చెందిన స్మగ్లర్‌పై కలెక్టర్ వెంకటేశ్వర్ పీడీ యాక్టు కింద కేసు నమోదుకు ఆదేశించారు. అరక్కోణం పట్టణం పిళ్లారి కోవిల్ వీధికి చెందిన బాబు నాయుడు కుమారుడు అజిత్ నాయుడు (29) అరక్కోణం తాలూకా పరిధిలోని కిజవనం పంచాయతీ బోడినాయుడు కండ్రిగలో నివాసం ఉంటున్నారు. కొంతకాలంగా జిల్లా పరిధిలో ఎర్రచందనం వృక్షాల నరికివేత, అక్రమ రవాణా వ్యవహారాల్లో పాల్గొంటున్నాడు. గతేడాది నుంచీ ఎర్రచందనం టాస్క్‌ఫోర్స్ పోలీసు స్టేషన్‌లో ఇతడిపై ఐదు కేసులు నమోదయ్యాయి. ప్రస్తుతం కడప సెంట్రల్ జైలులో రిమాండులో వున్నాడు. ఇతడి నేర చరిత్ర, వాటి తీవ్రతలను దృష్టిలో వుంచుకుని కలెక్టర్ వెంకటేశ్వర్ గత నెల 11వ తేదీన పీడీ యాక్టు ప్రయోగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. గత నెల 27న వీడియో కాన్ఫరెన్సు ద్వారా అడ్వైజరీ బోర్డు ఈ కేసును సమీక్షించి సానుకూల నివేదిక ఇవ్వడంతో ప్రభుత్వం కలెక్టర్ నిర్ణయాన్ని ఆమోదించింది. ఈ మేరకు సీఎస్ కె.విజయానంద్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు.

శ్రీనివాసులు హత్యకు కారణాలేమిటి?



శ్రీనివాసులు మృతదేహం

ఆరా తీస్తున్న చెన్నై పోలీసులు ● దర్యాప్తులో సహకరించేందుకు చెన్నైకి రేణిగుంట సీఐ

తిరుపతి, జూలై 14 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో సంచలనం సృష్టించిన శ్రీకాళహస్తి జనసేన మాజీ ఇన్‌ఛార్జి వినుత మాజీ పీఏ శ్రీనివాసులు హత్యకు కారణాలేమిటన్నది అంతుబట్టడం లేదు. పాతికేళ్ల యువకుడిని పలుమార్లు చిత్రహింసలకు గురి చేశారని, దెబ్బలకు తట్టుకోలేకే అతడు చనిపోయాడని చెన్నై పోలీసుల ప్రాథమిక దర్యాప్తులో వెల్లడైంది. హత్యకు గురైంది కూటమి ప్రభుత్వంలోని అధికార పార్టీకి చెందిన మహిళా నేత డ్రైవరు, వ్యక్తిగత సహాయకుడూ కావడంతో ఇది సంచలనంగా మారింది. అన్ని రాజకీయ పార్టీల వర్గాలతో పాటు సామాన్య జనం కూడా హత్య వెనుక వాస్తవాలు తెలుసుకోవాలని ఆసక్తితో ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నది చెన్నై పోలీసులు కావడంతో హత్యపై సస్పెన్స్ కొనసాగుతోంది

నిందితుల కస్టడీకి పిటిషన్

శ్రీకాళహస్తి మండలం బొక్కిసపాలెం గ్రామానికి చెందిన శ్రీనివాసులు మృతదేహం చెన్నైలో లభించడంతో అక్కడి సెవెన్ వెల్స్ ప్రాంత పోలీసులు కేసు నమోదు చేసిన సంగతి తెలిసిందే. అందులో భాగంగా ప్రాథమిక దర్యాప్తులో శ్రీనివాసులు మృతికి శ్రీకాళహస్తి జనసేన ఇన్‌ఛార్జి వినుత, ఆమె భర్త చంద్రబాబు, వారి ముగ్గురు అనుచరులు కారకులని గుర్తించారు. వారిని అదుపులోకి తీసుకుని చెన్నైకి తరలించి కోర్టులో హాజరుపరిచి రిమాండుకు పంపించారు. అరెస్టుకు, రిమాండుకు పంపడానికి నడుమ పెద్దగా వ్యవధి లభించకపోవడంతో వారు నిందితులను లోతుగా విచారించలేదని తెలిసింది. అందుబాటులో ఉన్న సీసీ కెమెరాల ఫుటేజీల ఆధారంగా నిందితులను గుర్తించి కోర్టులో హాజరుపరిచారు. ఇపుడు నిందితులను కస్టడీకి తీసుకుని విచారిస్తే హత్యకు దారి తీసిన కారణాలేమిటన్నది తెలుస్తాయని చెన్నై పోలీసులు భావిస్తున్నారు. ఆ దిశగా వారు అక్కడి కోర్టులో కస్టడీ పిటిషన్ దాఖలు చేయడానికి సన్నద్ధమవుతున్నారు. ఈ లోపు చెన్నై పోలీసు కమిషనరేట్ నుంచీ వచ్చిన అభ్యర్థనతో కేసు దర్యాప్తులో సహకరించేందుకు రేణిగుంట సీఐని చెన్నై వెళ్లాల్సిందిగా జిల్లా ఎస్పీ హర్షవర్ధనరాజు ఆదేశించారు. దీంతో రేణిగుంట, శ్రీకాళహస్తి ప్రాంతాలకు సంబంధించిన సమాచారం ఇవ్వడంతో పాటు కేసు దర్యాప్తులో చెన్నై పోలీసులకు సహకరించడానికి రేణిగుంట సీఐ హుటాహుటిన చెన్నై బయల్దేరి వెళ్లారు.

హత్యకు ఇవేనా.. కారణాలు?

చెన్నై పోలీసులు నిందితులను ప్రాథమికంగా విచారించిన సందర్భంలో రెండు కారణాలు హత్యకు దారి తీసివుండవచ్చని భావించినట్టు తెలిసింది. వీటిలో ఒకటి వివాహేతర సంబంధం కాగా మరోటి వ్యక్తిగత సమాచారం ఇతరులకు చేరవేయడం అని చెన్నై పోలీసులు భావిస్తున్నారు. శ్రీనివాసులు తొలుత వినుతకు కారు డ్రైవరుగా నియమితులయ్యారని, తర్వాత క్రమంగా వ్యక్తిగత సహాయకుడిగా కూడా మారాడని తెలిసింది. ఆ కుటుంబానికి బాగా సన్నిహితంగా మారాడు. శ్రీకాళహస్తి, చెన్నై తదితర ప్రాంతాల్లో కొనసాగించిన వ్యక్తిగత వ్యవహారాలు, సెటిల్‌మెంట్లు వంటి వివరాలు శ్రీనివాసులు వద్ద వున్నట్టు చెన్నై పోలీసులు భావిస్తున్నారు. వాటిని చూపి బ్లాక్‌మెయిల్ చేయడం, వినుత ప్రత్యర్థులకు వాటిని అందించడం వంటివేవో జరిగాయని అనుమానిస్తున్నారు. వినుత దంపతులు శ్రీనివాసులును పీఏగా తొలగిస్తున్నట్టు విడుదల చేసిన ప్రకటనలో కూడా 'అతడు తమ ప్రాణ, గౌరవాలకు భంగం కలిగించాడు' అని స్పష్టంగా పేర్కొనడం గమనార్హం. ఈ దిశగానే విచారిస్తున్నారు.

దూకుడు రాజకీయాలతో ఒంటరైన వినుత

కాగా, రాజకీయంగా బలం లేకపోయినా వినుత వర్గం దూకుడుగా వ్యవహరిస్తూ ప్రతిపక్ష నేతలతో పాటు కూటమి పార్టీల నేతలతో కూడా వ్యక్తిగత వైరాన్ని కొనితెచ్చుకున్నట్టు నియోజకవర్గంలో ప్రచారమవుతోంది. చివరికి సొంత పార్టీలో కూడా అందరూ దూరమయ్యారని, ఇరుగుపొరుగు నియోజకవర్గాల నేతలు, జిల్లా నేతల తోనూ సత్సంబంధాలు లేవని జనసేన వర్గాలే చెబుతున్నాయి. ఒకరకంగా నియోజకవర్గంలోనూ, జిల్లాలోనూ రాజకీయంగా వినుత ఒంటరిగా మారినట్టయిందని సమాచారం. ఆ క్రమంలో వినుత పీఏగా ఉండిన శ్రీనివాసులు ఇతర పార్టీలకు చెందిన ఒకరిద్దరు నేతలకు టచ్‌లోకి వెళ్లారని, వినుత వర్గానికి చెందిన అభ్యంతరకర అంశాలు, ఫొటోలు, వీడియోలు, సమాచారం వారికి అందజేశాడనే ఆరోపణలున్నాయి. రాజకీయ ప్రత్యర్థులు వాటిని ఎప్పటికప్పుడు జనసేన అధిష్ఠానానికి చేరవేశారని సమాచారం. వినుతను జనసేన నుంచీ బహిష్కరిస్తున్నట్టు ఆ పార్టీ అధిష్ఠానం జారీ చేసిన ప్రకటనలో సైతం గత కొంతకాలంగా పార్టీ నిబంధనలకు విరుద్ధంగా వినుత వ్యవహార శైలి వుందని పేర్కొన్న సంగతి ఈ సందర్భంగా గమనించాల్సి వుంది. మొత్తానికి శ్రీనివాసులు హత్య కేసుతో వినుత రాజకీయ భవిష్యత్తు దెబ్బతిన్నట్టయింది.

నూతన కాటేజీ విధానాన్ని రూపొందించండి

అధికారులకు టీటీడీ ఈవో శ్యామలరావు ఆదేశం



తిరుమల, జూలై 14(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి దర్శనార్థం వచ్చే భక్తులకు వసతి కల్పించేందుకు నూతన కాటేజీ విధానాన్ని రూపొందించాలని టీటీడీ ఈవో శ్యామలరావు అధికారులను ఆదేశించారు. తిరుపతిలోని టీటీడీ పరిపాలన భవనంలో ఆయన సోమవారం అదనపు ఈవో వెంకయ్య చౌదరి, అధికారులతో సమీక్షించారు. ఈవో మాట్లాడుతూ భక్తులకు సౌకర్యవంతంగా ఉండేలా దాతలు కాటేజీలు నిర్మించేందుకు వీలుగా విధానపరమైన బ్లూప్రింట్‌ను తయారు చేయాలన్నారు. నిర్దేశించిన సమయానికి దాతలు కాటేజీలను నిర్మించి టీటీడీ అప్పగించేలా, దాతలకు కేటాయించిన ప్రివిలేజస్ దుర్వినియోగం కాకుండా చూడాలన్నారు. కాటేజీల నిర్మాణానికి దాతల ఎంపిక, విధివిధానాలు, బాధ్యతలు వంటి అంశాల్లో పారదర్శకంగా ఉండేలా నిబంధనలను రూపొందించాలన్నారు. అంతకుముందు నూతన కాటేజీల నిర్మాణానికి సంబంధించిన విధానపరమైన అంశాలపై అదనపు ఈవో వెంకయ్య చౌదరి వర్చువల్ ద్వారా ఈవోకు వివరించారు. ఈ సమీక్షలో రిసెప్షన్ డిప్యూటీ ఈవో ఆర్‌1 భాస్కర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

టీజీపీ ఎస్ఈగా రాధాకృష్ణమూర్తి

తిరుపతి(విద్య), జూలై 14(ఆంధ్రజ్యోతి): తెలుగుగంగ, గాలేరు - నగరి ప్రాజెక్టుల సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజినీరుగా డి.రాధాకృష్ణమూర్తి నియమితులయ్యారు. ఆ మేరకు ఆయన సోమవారం తిరుపతిలోని నీటి పారుదల శాఖ ప్రధాన కార్యాలయంలో బాధ్యతలు తీసుకున్నారు. ఇప్పటివరకు వెంకటగిరి తెలుగు గంగ ప్రాజెక్టులో ఎగ్జిక్యూటివ్ ఇంజినీరుగా పనిచేశారు. పదోన్నతిలో భాగంగా పూర్తి అదనపు బాధ్యతలతో తెలుగు గంగ, గాలేరు - నగరి ప్రాజెక్టుల సూపరింటెండెంట్ ఇంజినీర్‌గా ప్రభుత్వం నియమించింది.

18 'విండో'లకు పర్సన్ ఇన్‌ఛార్జి కమిటీలు

- కాయంపేటకు అమాస.. ఐతేపల్లికి పల్లినేని



తిరుపతి, జూలై 14 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో 18 సింగిల్ విండోలకు అఫిషియల్ పర్సన్ ఇన్‌ఛార్జి కమిటీల స్థానంలో ప్రభుత్వం నాన్ అఫిషియల్ పర్సన్ ఇన్‌ఛార్జి కమిటీలను నియమించింది. శిద్ధవరం, చిట్టమూరు విండోల పదవీ కాలం అక్టోబరు నెలాఖరు దాకా ఉండగా, మిగిలిన 16కు ఈ నెలాఖరుకే ముగియనుండడం గమనార్హం. కాగా, **కాయంపేట** సింగిల్‌విండోకి చైర్మన్‌గా డీసీసీబీ చైర్మన్ అమాస రాజశేఖర్ రెడ్డి.. సభ్యులుగా ఎం.దేవరాజులు నాయుడు, వేమూరి మంజుల నియమితులయ్యారు.

ఐతేపల్లి: పల్లినేని సుబ్రమణ్యం నాయుడు.. బి.భాస్కర్ బాబు, ఎం.వెంకటముని

గూడూరు (24): అల్లూరు కరుణాకరరెడ్డి.. దువ్వూరు రవీంద్రరెడ్డి, బచ్చల రవీంద్రారెడ్డి

బూదనం: పెజ్జయి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి.. అన్నంరెడ్డి కిరణ్, జరుగుమల్లి అనిల్

తిప్పగుంటపాలెం: దువ్వూరు రాజశేఖర్‌రెడ్డి.. కండలి శీనయ్య, గోను కోటయ్య

మల్లాం: రామిశెట్టి హరినాథ్.. గొల్ల మణి, చేను వెంకటయ్య

తిన్నెలపూడి: వల్లగతి బాస్కర్‌రెడ్డి.. వనబాక కోటేశ్వరరావు, పచ్చలపల్లి చిరంజీవి

ఉనుగుంటపాలెం: నల్లపరెడ్డి జగన్‌మోహన్ రెడ్డి.. పట్టపు వెంకటేశ్వర్లు, పాకనాటి జనార్దన్

కొత్తపాలెం: ఉచ్చూరు రవీంద్రారెడ్డి.. కాశల శ్రీనివాసులు, గుండాల సుబ్రమణ్యం

చిల్లేడు: చపలా శ్రీనివాసులు.. దూడివల్లి సతీష్, చంద్రగిరి మధు

వాకాడు: ఉచ్చూరు లక్ష్మీ ప్రసాద్ రెడ్డి.. దశకాయల కృష్ణమూర్తి, తిరుమూరు వెంకటకృష్ణారెడ్డి

నరసింగాపురం: పి.వినోద్ కుమార్.. బి.ఉమామహేశ్వరరావు, టి.రెడ్డెప్ప శెట్టి

వడమాలపేట: డి.భూచంద్ర ప్రసాద్.. వి.వెంకట్రమణ, ఎన్.పొన్నయ్య రాజు

చెర్లోపల్లె: జి.నరేంద్రరెడ్డి.. ఎస్.రాజేంద్ర నాయుడు, ఎం.విజయభాస్కరరాజు

పరమేశ్వరమంగళం: ఎస్.మోహన్ రాజు.. ఇ.సుధాకరుడు, డి.జాన్ భాస్కర్

తడుకు: సి.కరుణ.. ఎ.భాస్కర్, టి.విజయ్‌భాస్కర్‌రెడ్డి

శిద్ధవరం: సింగిల్‌విండో కమిటీకి చైర్మన్‌గా పి.కోటేశ్వరరెడ్డి, సభ్యులుగా కోట వాసు, జరుగుమల్లి మల్లీశ్వరి నియమితులయ్యారు.

చిట్టమూరు: గొండుబోయిన కస్తూరయ్య.. నరమల మోహన్, కంటేపల్లి వెంకటరమణయ్య

సూర్యనారాయణస్వామికి యజ్ఞోపవీతం, పంచపాత్రల వితరణ



ఆలయ అధికారులకు యజ్ఞోపవీతం అందజేస్తున్న దాత

తిరుచానూరు, జూలై 14(ఆంధ్రజ్యోతి): తిరుచానూరులో కొలువై ఉన్న సూర్యనారాయణస్వామికి సోమవారం విజయనగరానికి చెందిన ధనలక్ష్మి జ్యూవెలరీస్ వారు రూ.1.60లక్షలు విలువ చేసే వెండి యజ్ఞోపవీతం, పంచపాత్రలను వితరణ చేశారు. వీటిని ఆలయ అధికారులు స్వీకరించి దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే ఢిల్లీకి చెందిన ఓ దాత రూ.6లక్షలు విలువచేసే కరెన్సీ నోట్ల లెక్కింపుమిషను అమ్మవారికి వితరణగా అందజేశారు. దీనిని అమ్మవారి పరకామణి లెక్కింపులో వినియోగించనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈవో దేవరాజులు, అర్చకుడు బాబుస్వామి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు: టీడీపీ



రాయలచెరువుపేటలో ప్రచారం నిర్వహిస్తున్న టీడీపీ నాయకులు

రామచంద్రాపురం, జూలై 14(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పార్టీలకు అతీతంగా ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందిస్తోందని టీడీపీ మండలాధ్యక్షుడు తిరుమలరెడ్డి అన్నారు. మండలంలోని రాయలచెరువుపేటలో సోమవారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం జరిగింది. ఆయన మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి ఎలాంటి అభివృద్ధి చేయలేదన్నారు. ఎమ్మెల్యే నాని ఏడాదిలోనే మండలంలో అభివృద్ధి పనులకు రూ.7కోట్లు ఖర్చు చేయించారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు ఉమాపతి నాయుడు, హరిప్రసాద్, నరసింహారెడ్డి, మండల నాయకులు గిరి నాయుడు, మధుసూదన్‌రెడ్డి, సురేంద్ర నాయుడు, మాధవయ్య, నాగభూషణం పాల్గొన్నారు.

ఆకట్టుకున్న పాండవ జననం

రామచంద్రాపురం, జూలై 14(ఆంధ్రజ్యోతి): రామాపురం మహాభారతం ఉత్సవాల్లో భాగంగా భాగవతారిణి అనసూయ సోమవారం వినిపించిన పాండవ జననం, ద్రోణాచార్యుల వద్ద విద్యాభ్యాసం నటికలను ఆకట్టుకుంది. ఈ సందర్భంగా కుంతీదేవి పాండురాజు అనుమతితో యమధర్మరాజు, వాయుదేవుడు, ఇంద్రుడు, అశ్వినివరాల వలన పాండవులకు జన్మనిచ్చే ఘట్టాలతో పాటు ద్రోణాచార్యుల వద్ద పాండవులు, కౌరవులు విద్యను అభ్యసించే ఘట్టాలను భాగవతారిణి రక్తి కట్టించారు. ఈ సందర్భంగా ఆలయంలో మూలమూర్తులకు తిరుమంజనం నిర్వహించి, ప్రత్యేక అలంకరణ చేపట్టారు.

ఆర్‌సీపురం తహసీల్దారుగా మధుసూదనరావు



రామచంద్రాపురం, జూలై 14(ఆంధ్రజ్యోతి): మండల తహసీల్దారుగా మధుసూదన్‌రావు సోమవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న వెంకటరమణ పదవీ విరమణ చేయడంతో కలెక్టరేట్‌లో విధులు నిర్వహిస్తున్న మధుసూదన్‌రావు బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురికాకుండా చూస్తానని, రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఈయనకు డీటీ అన్వర్‌బాషా, సిబ్బంది స్వాగతం పలికి పుష్పగుచ్ఛాలు అందజేశారు.

విద్యార్థుల మధ్య వివాదం



గోపీని అదుపులోకి తీసుకొంటున్న పోలీసులు

చంద్రగిరి, జూలై 14: చంద్రగిరిలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో ఇద్దరు విద్యార్థుల మధ్య వివాదం చోటుచేసుకుంది. చంద్రగిరికి చెందిన క్రిష్ణకుమార్ జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. అదే కళాశాలలో చెర్లోపల్లెకు చెందిన యువరాజు ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. మూడు రోజుల క్రితం కళాశాల క్రీడా మైదానంలో వాలీబాల్ ఆడుతుండగా ఇద్దరి మధ్య వివాదం చోటుచేసుకుంది. దీంతో సోమవారం యువరాజు తన సోదరుడు గోపీకి చెప్పడంతో, అతడు మరో ఇద్దరు యువకులను తీసుకొచ్చి కళాశాల గదిలో ఉన్న క్రిష్ణకుమార్‌పై దాడి చేశారు. తరగతి గదిలో ఉన్న విద్యార్థులు, అధ్యాపకులు గొడవను అడ్డుకుని, పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు గోపీ, యువరాజు, మరో ఇద్దరు యువకులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

శ్రీనివాసమంగాపురంలో కనకదుర్గమ్మ గుడికి తాళం

● సింగ్‌ల చర్యతో గ్రామస్థుల ఆందోళన



కనకదుర్గమ్మ ఆలయంవద్ద గుమికూడిన ఇరు వర్గాలు

చంద్రగిరి, జూలై 14(ఆంధ్రజ్యోతి): చంద్రగిరి మండలం శ్రీనివాసమంగాపురంలోని కనకదుర్గమ్మ ఆలయం ముందు గ్రామస్థులు ఆందోళన చేశారు. శ్రీనివాసమంగాపురం గ్రామస్థులకు, అమ్మవారిని కొలుస్తున్న సింగులకు కొంత కాలంగా ఆలయ నిర్వహణపై వివాదం జరుగుతోంది. ఈ క్రమంలో సోమవారం గ్రామస్థులు కనకదుర్గమ్మ ఆలయానికి పెయింటింగ్ వేయిస్తున్నారు. మధ్యాహ్న భోజన సమయంలో సింగులకు సంబంధించిన కొంతమంది మహిళలు వచ్చి ఎవరూలేని సమయంలో ఆలయానికి తాళాలు వేశారు. దీంతో గ్రామస్థులు ఆలయం ముందు ఆందోళనకు దిగారు. పోలీసులు ఆలయానికి చేరుకుని ఇరువర్గాలకు సర్ది చెప్పారు. సాయంత్రం వరకు ఇరు వర్గాలు ఆలయం ముందే ఉండటంతో ఉన్నతాధికారులతో సంప్రదించి మంగళవారం నిర్ణయం తీసుకొంటామని పోలీసులు తెలిపారు. దీంతో ఇరువర్గాలు ఆలయం నుంచి వెనుదిరిగాయి.

డ్రంకెన్ డ్రైవ్ కేసుల్లో 17 మందికి జరిమానా

తిరుపతి(నేరవిభాగం), జూలై 14(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో మద్యం తాగి వాహనాలు నడిపిన 17మందికి జరిమానా విధిస్తూ తిరుపతి జిల్లా ప్రత్యేక న్యాయమూర్తి గ్రంధి శ్రీనివాస్ తీర్పు చెప్పారు. అతిగా మద్యం తాగి వాహనాలు నడుపుతూ ట్రాఫిక్‌కు ఇబ్బంది కలిగించిన 17 మందిపై ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసి, న్యాయమూర్తి ఎదుట హాజరుపరచగా రూ.10చొప్పున జరిమానా విధించారు.

మంత్రి లోకేష్‌ను కలిసిన హేమాంబరధరరావు



చంద్రగిరి, జూలై 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేషను సోమవారం ఉండవల్లిలోని తన తన నివాసంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మీరపల్లి హేమాంబరధరరావు మర్యాదపూర్వకంగా కలిశారు.

టైర్ పంక్చరై మినీ లారీ బోల్తా

● డ్రైవర్‌కు స్వల్ప గాయాలు



చంద్రగిరి, జూలై 14(ఆంధ్రజ్యోతి): చంద్రగిరి మండలం, తొండవాడ వద్ద పూతలపట్టు - నాయుడుపేట జాతీయ రహదారిలో సోమవారం రాత్రి మినీ లారీ టైరు పంక్చరై అదుపు తప్పి బోల్తా పడింది. ఈప్రమాదంలో డ్రైవర్‌కి స్వల్ప గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు బెంగళూరు నుంచి తిరుపతికి స్టీల్ సామాన్ల లోడుతో వస్తున్న మినీ లారీ సోమవారం రాత్రి 10.30 గంటల సమయంలో తొండవాడ జాతీయ రహదారిలో టైరు పంక్చరై అదుపు తప్పి బోల్తా పడింది. ఈప్రమాదంలో డ్రైవర్‌కి స్వల్ప గాయాలు కాగా, చికిత్స నిమిత్తం చంద్రగిరి సీహెచ్‌సీ ఆస్పత్రికి హైవే అంబులెన్స్ ద్వారా తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

యువతకు ఉద్యోగ అవకాశాల కల్పనకు కృషి

● ఎమ్మెల్యే పులివర్తి నాని

పాకాల, జూలై 14 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీకి కట్టుబడి యువత ఆర్థికంగా ఎదిగేలా కృషిచేస్తానని ఎమ్మెల్యే పులివర్తి నాని అన్నారు. సోమవారం మండలంలోని ఆదెనపల్లె పంచాయతీ కె.వడ్డేపల్లె రెవెన్యూ పరిధిలో 60 ఎకరాల స్థలాన్ని తహశీల్దార్ సంతోష్‌సాయితో కలిసి పరిశీలించారు. పరిశ్రమలు, ప్రభుత్వ విద్యాలయాలు స్థాపించడానికి, ఇతర ప్రయోజనాలకు ఈస్థలాన్ని ఉపయోగిస్తామన్నారు. స్థానికంగా 300 నుంచి 600 మంది యువతీ యువకులకు ఉద్యోగ అవకాశాలు కల్పించడానికి ప్రతిపాదనలు సిద్ధం చేశామన్నారు. మండల టీడీపీ కన్వీనర్ బి.నాగరాజ నాయుడు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

తిరుమల కాంటీన్లకు ఈవోఐ గడువులలో మార్పు

తిరుమల, జూలై 14(ఆంధ్రజ్యోతి): తిరుమలలోని ఐదు పెద్ద కాంటీన్లు, 5 జనతా కాంటీన్ల కేటాయింపు కోసం టీటీడీ ఆహ్వానించిన ఈవోఐ పత్రాల జారీ, సమర్పణ, పరిశీలనకు సంబంధించిన తేదీలను పరిపాలనా కారణాల వల్ల మార్పు చేసినట్టు టీటీడీ సోమవారం ఒక ప్రకటన ద్వారా తెలిపింది. పెద్ద కాంటీన్లకు సంబంధించి ప్రతాల డౌన్‌లోడ్ ముగింపు జూలై 15 నుంచి 26వ తేదీ సాయంత్రం ఐదు గంటలకు మార్చింది. ఈవోఐ పత్రాల సమర్పణకు 17 నుంచి 28వ తేదీ ఉదయం 11 గంటలకు, పత్రాలను తెరిచే తేదీని 17 నుంచి 28వ తేదీ మధ్యాహ్నం 12 గంటలకు మార్చింది. ఇక, జనతా కాంటీన్లకు సంబంధించి పత్రాల డౌన్‌లోడ్ ముగింపు తేదీని 17 నుంచి 28వ తేదీ సాయంత్రం 5 గంటలకు, ఈవోఐ పత్రాల సమర్పణ చివరి తేదీని 19 నుంచి 30వ తేదీ ఉదయం 11 గంటలకు, పత్రాలను తెరిచే తేదీని 19 నుంచి 30వ తేదీ మధ్యాహ్నం 12 గంటలకు మార్చినట్టు పేర్కొంది.

ఆర్టీసీ కార్గో సేవల విస్తరణ

తిరుపతి(ఆర్టీసీ), జూలై 14(ఆంధ్రజ్యోతి): ప్రజల సౌకర్యార్థం మరిన్ని ప్రాంతాలకు ఆర్టీసీ కార్గో సేవల విస్తరణకు చర్యలు చేపట్టామని ప్రజారవాణాధికారి ఎం.జగదీష్ అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు ఆథరైజ్ పార్సిల్ బుకింగ్(ఏపీబీ) ఏజెంట్ కేంద్రాలు జిల్లావ్యాప్తంగా 29, చెన్నై డివిజన్ పరిధిలో 4 అందుబాటులో ఉన్నాయన్నారు. ప్రజల అవసరాల దృష్ట్యా అధిక జనసంచారం, వాణిజ్య రవాణా ప్రాంతాలకు సేవలను విస్తరించనున్నట్లు చెప్పారు. ఇందులో భాగంగా మహిళాయూనివర్సిటీ, కరకంబాడీరోడ్డు, రేణిగుంట, చంద్రగిరి, పాకాల, ఆర్సీపురం రోడ్డు, వడమాలపేట, గాజులమండ్యం, కేవీబీ పురం, బి.ఎన్.కండ్రిగ, శ్రీకాళహస్తి బైపాస్‌రోడ్డు, వెంకటగిరి, కార్వేటనగరం, మిన్‌కురు, శ్రీసిటీ, మాంబట్టు, దొరవారిసత్రం, ఊత్తుకోట, తిరుత్తణి, కంచిలలో ఏపీబీకి అవకాశం కల్పిస్తున్నామన్నారు. కార్పొరేషన్, ఇంటర్ స్టేట్ రూ.5వేలు, మున్సిపాలిటీలో రూ.2,500, గ్రామ, మండల కేంద్రాలలో రూ.1000 డిపాజిట్ చెల్లించాల్సి ఉంటుందని వెల్లడించారు. రూ.100కు రూ.15కమీషన్ ఇస్తామన్నారు. ఇదే కేంద్రాలలో బస్సు టిక్కెట్ బుకింగ్ కౌంటర్ ఏర్పాటు చేసుకుంటే రూ.వెయ్యి అదనంగా చెల్లించాలని సూచించారు. అలాగే సుదూర ప్రాంతాలకు బస్సు డిక్కీ, రూఫ్‌టాప్ బుకింగ్స్‌కు అవకాశం కల్పిస్తున్నామన్నారు. ఆసక్తిగలవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, మరిన్ని వివరాల కోసం 7331147268, 9553855667లను సంప్రదించాలని కోరారు.

ఆగమోక్తంగా మృత్యుంజయ పూజలు

శ్రీకాళహస్తి, జూలై 14(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో కొలువైన మృత్యుంజయస్వామికి సోమవారం ఆగ మోక్తంగా పూజలు నిర్వహించారు. ముందుగా వినాయక స్వామికి పలు రకాల సుగంధ ద్రవ్యాలతో అభిషేకం చేశారు. అనంతరం వివిధ పుష్పాలతో, గజమాల, వెండి నాగాభరణంతో స్వామివారిని శోభాయమానంగా అలంకరించారు. ధూప, దీప నైవేద్యాలు, మహామంగళ హారతులు సమర్పించారు. భక్తులు పెద్దసంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు.

రైలునుంచి గర్భిణీని తోసేసిన కేసులో దోషికి జీవిత ఖైదు

● బాధితురాలికి రూ.కోటి పరిహారం

చెన్నై, జూలై 14 (ఆంధ్రజ్యోతి): రైలు నుంచి గర్భిణీని తోసివేసిన ఘటనలో నిందితుడికి జీవిత ఖైదు విధించిన న్యాయస్థానం, బాధిత మహిళ (37)కు రూ. కోటి పరిహారం అందించాలని ఉత్తర్వులు జారీచేసింది. తమిళనాడు రాష్ట్రం తిరుప్పూర్‌లో భర్తతో కలిసి వుంటున్న ఆ గర్భిణీ.. పుట్టినిల్లైన చిత్తూరు సమీపంలోని మంగసముద్రానికి ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్‌లో బయల్దేరగా, వేలూరు జిల్లా గుడియాత్తం-కేవీ కుప్పం రైల్వే స్టేషన్ల మధ్య ఓ కామాంధుడు ఆమెపై అత్యాచారయత్నం చేసిన విషయం తెలిసిందే. అయితే ఆ మహిళ తనను ప్రతిఘటించిందన్న కోపంతో ఆ వ్యక్తి రైలునుంచి కిందకు తోసివేశాడు.ఈ ఘటనలో ఆమె తీవ్రంగా గాయపడడంతో పాటు ఆమెకు అబార్షన్ కూడా అయింది. ఈ ఘటనపై విచారణ చేపట్టిన పోలీసులు.. మహిళను రైలు నుంచి తోసివేసిన వేలూరు జిల్లా పూంజాలై గ్రామానికి చెందిన హేమరాజ్ (30)ను అరెస్ట్ చేశారు. హేమరాజ్‌పై 8 సెక్షన్ల కింద కేసు నమోదు చేయగా, తిరుపత్తూర్ జిల్లా కోర్టులో విచారణ జరిగింది. ఈ నేపథ్యంలో సోమవారం హేమరాజ్‌ను దోషిగా తేల్చిన జిల్లా కోర్టు న్యాయాధికారిణి మీనాకుమారి..అతనికి 15 సంవత్సరాల కఠిన కారాగారశిక్ష, జీవితఖైదు విధిస్తున్నట్లు ప్రకటించారు. అదే విధంగా బాధిత మహిళకు రైల్వేశాఖ రూ.50 లక్షలు, రాష్ట్ర ప్రభుత్వం రూ.50 లక్షల చొప్పున రూ. కోటి పరిహారంగా అందించాలని ఆదేశించారు.

సమస్యల సత్వర పరిష్కారానికే 'సుపరిపాలనలో తొలిఅడుగు'

● ఎమ్మెల్యే పులివర్తి నాని



కరపత్రాలు ఇస్తున్న ఎమ్మెల్యే పులివర్తి నాని

పాకాల, జూలై 14 (ఆంధ్రజ్యోతి): ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకొని సత్వర పరిష్కారం కోసమే సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే పులివర్తి నాని అన్నారు. మండలంలోని వంటపల్లె పంచాయతీ జయదేవపురం కాలనీలో సోమవారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. కాలనీలో ఇంటింటికీ వెళ్లి అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాల కరపత్రాలను అందజేశారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కొన్ని సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారు. మిగిలినవి అధికారులు ప్రాధాన్యత క్రమంగా త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. అనంతరం కుందేటివారిపల్లెలో గ్రామస్థులతో సమావేశమయ్యారు. గ్రామంలో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మండల స్థాయి అధికారులు గ్రామంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో మండల టీడీపీ కన్వీనర్ బి.నాగరాజనాయుడు, టీడీపీ నాయకులు రెడ్డిప్రసాద్, వినోద్ కుమార్, మనోహర్, విష్ణు, కె.సావిత్రి, కె.సుధాకరయ్య, చాముండేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

మఠం భూముల్లో మౌలిక సదుపాయాలు కల్పించండి..!

● రూరల్ మండల ఎంపీపీ, వైస్‌ఎంపీపీలు



ఎంపీడీవో, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో మాట్లాడుతున్న ఎంపీపీ, వైస్‌ఎంపీపీ తదితరులు

తిరుపతి రూరల్, జూలై 14(ఆంధ్రజ్యోతి): తుమ్మలగుంటలోని మఠం భూముల్లో దాదాపు 200మందికిపైగా కుటుంబాలు స్థిరనివాసాలు ఏర్పరచుకుని జీవనం సాగిస్తున్నారని, వారికి మౌలిక సదుపాయాలు కల్పించాలని ఎంపీపీ మూలం చంద్రమోహన్‌రెడ్డి, వైఎస్ ఎంపీపీ విడుదల మాధవరెడ్డి పేర్కొన్నారు. తిరుపతి రూరల్ మండల ఎంపీపీ కార్యాలయంలో సోమవారం ఎంపీడీవో రామచంద్ర, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, కార్యదర్శితో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. సర్వేనంబర్లు 95, 96, 97లలో నివాసం ఉంటున్న వారు గత రెండేళ్లుగా పంచాయతీకి ఇంటి పన్నులు చెల్లిస్తున్నారని, ఎన్‌వోసీలు తీసుకుని విద్యుత్‌మీటర్లు కూడా పొందారని వివరించారు. బాధిత కుటుంబాలకు తాగునీరు సదుపాయం కల్పించాలని మండల పరిషత్ సమావేశంలో పలుమార్లు జెడ్పీటీసీ రత్నమ్మ, ఎంపీటీసీ బుజ్జమ్మలు కోరినా, అధికారులు పట్టించుకోక పోవడం సమంజసం కాదన్నారు. దీనిపై స్పందించిన ఎంపీడీవో రామచంద్ర, పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మఠం భూముల్లో మౌలిక సదుపాయాల కల్పన తమ చేతుల్లో లేదని, ఉన్నతాధికారులు, ఎమ్మెల్యే పులివర్తి నాని దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. తిరుపతి రూరల్ మండలంలోని కుంట్రపాకం, ఓటేరు, పాతకాల్వ పంచాయతీల్లో నీటి ఎద్దడిని అధిగమించేలా కొత్త బోర్లు, మోటార్లు, పైపులైన్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఎంపీపీ సూచించారు. పెరుమాళ్లపల్లెలో మోటారు, పైపులైన్ మంజూరుకి ప్రతిపాదనలు చేయాలని తెలిపారు. పేరూరులో రాములవారి గుడి వద్ద సిమెంటురోడ్డు మరమ్మతులు చేపట్టాలన్నారు.

ఈవోగారూ.. టీటీడీలో అన్యమతస్థులను తరిమేయండి

● బీజేపీ నేతల డిమాండ్

● భూమన ఇప్పుడేం చెబుతారంటూ ప్రశ్న



అన్యమత స్టిక్కర్లతో ఉన్న కారు

తిరుపతి(ఉపాధ్యాయనగర్), జూలై 14 (ఆంధ్రజ్యోతి): ఈవో గారూ.. టీటీడీలో తిష్టవేసిన అన్యమతస్థులను తరిమేయండంటూ బీజేపీ జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్ కోరారు. కర్నూలులోని టీటీడీ కల్యాణ మండపంలో పనులను పర్యవేక్షిస్తున్న క్వాలిటీ కంట్రోల్ డీఈఈ ఇలియాజర్ క్రైస్తవ మత వాక్యాలకు చెందిన స్టిక్కర్లు వేసిన కారు ఉపయోగిస్తున్నారని పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం ఆయన ఒక ప్రకటనతో పాటు.. ఫొటోనూ విడుదల చేశారు. క్రైస్తవ సూక్తులున్న వాహనంలో ప్రయాణించడమే కాకుండా చేతిలో బైబిల్ పెట్టుకోవడంపై ప్రశ్నించిన వారికి ఇది నా వ్యక్తిగతమని చెబుతున్నారని ఆరోపించారు. టీటీడీలో పనిచేసే అన్యమత ఉద్యోగుల సంఘానికి అధ్యక్షుడిగా వ్యవహరిస్తున్న భూమన కరుణాకర్ రెడ్డి ఇప్పుడేమంటారని ప్రశ్నించారు. టీటీడీ క్వాలిటీ కంట్రోల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఇలియాజర్‌ను తక్షణ విధులనుంచి తొలగించాలని టీటీడీ ధర్మకర్తల మండలి సభ్యులు భానుప్రకాష్‌రెడ్డి డిమాండ్ చేస్తూ సోమవారం ఓ వీడియో విడుదల చేశారు. కర్నూలు టీటీడీ కల్యాణ మండపం ఆవరణలో క్రైస్తవ మత ప్రచార సిక్కర్లతో ఉన్న ఆ కారుపై కళ్యాణమడపం మేనేజర్ టీటీడీ అధికారులకు ఫిర్యాదు చేశారని, తానూ టీటీడీ ఈఓ, విజిలెన్స్ అధికారులకు ఫిర్యాదు చేసినట్టు భానుప్రకాష్‌రెడ్డి చెప్పారు. అన్యమత స్టిక్కర్లు అంటించిన వాహనంలో తిరగాలంటే దేశమంతా తిరుగుగాని.. టీటీడీకి చెందిన పరిసరాల్లో రావొద్దని ఇలియాజర్‌ను హెచ్చరించారు. టీటీడీలో వెయ్యి మందికిపైగా ఉన్నారంటూ కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ చెప్తే భూమన కరుణాకర్‌రెడ్డికి ఎక్కడలేని ఆవేశం వచ్చిందన్నారు. ఎందుకు ఆయన భుజాలు తడుముకుంటున్నారని ప్రశ్నించారు. ఇప్పుడు ఇలియాజర్ అంశం వెలుగుచూసిన నేపథ్యంలో కరుణాకర్‌రెడ్డి ఏంచెప్తారని నిలదీశారు.

అంతర్రాష్ట్ర రైలు దోపిడీ కేసుల్లో ఇద్దరి అరెస్టు



పట్టుబడ్డ ముఠా సభ్యుల గురించి వివరిస్తున్న రైల్వే ఎస్పీ రాహుల్ మీనా



ఎస్పీనుంచి ప్రశంసా పత్రం అందుకుంటున్న సీఐ సుధాకర రెడ్డి - హెడ్ కానిస్టేబుల్ నాగాంజనేయులు

చిత్తూరు అర్బన్, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : పలు అంతర్రాష్ట రైలు దోపిడీలకు సంబంధించిన ముఠాలో ఇద్దరిని రైల్వే పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి రెండు కత్తులను, రెండు కట్టర్లను స్వాధీనం చేసుకుని ముఠాలో మిగిలిన వారికోసం గాలిస్తున్నారు.వేగంగా వెళుతున్న రైలును ఆపి వాళ్లు ఏ విధంగా దోపిడీకి పాల్పడతారో తిరుపతి రైల్వే డీఎస్పీ హర్షితతో కలిసి రైల్వే ఎస్పీ రాహుల్ మీనా సోమవారం మీడియాకు వివరించారు.'ఇటీవల గుంతకల్లు రైల్వే డివిజన్ పరిధిలో రైలు దోపిడీ సంఘటనలు చోటు చేసుకున్నాయి. ఉదయాత్పూర్వం 2గంటల నుంచి 4 గంటల మధ్యలో నిర్మానుష్య ప్రాంతాల్లో రైలు ఆగిపోయేలా సిగ్నల్ బాక్సుల్లో వైర్లను ట్యాంపరింగ్ చేసి దోపిడీలకు ఈ ముఠా సభ్యులు పాల్పడుతున్నట్టు గుర్తించాం. స్లీపర్, జనరల్ కోచ్‌లలో కూర్చుని పథకం ప్రకారం కిటికీల పక్కన కూర్చున్న మహిళలను లక్ష్యంగా ఎంచుకుని బంగారు ఆభరణాలను దోచుకెళ్లేవారు.ప్రత్యేక బృందాలతో ఆపరేషన్‌ను ప్రారంభించాం.మహారాష్ట్రలోని సోలాపూర్, పూనే ప్రాంతాల్లో గాలింపు చర్యలు చేపట్టాం. మాకు అందిన సమాచారం మేరకు ఈ నెల 13న తిరుపతి జిల్లా రేణిగుంటలో పూనే జిల్లా ఖడ్కి గ్రామానికి చెందిన జలిందర్ మహిర్యా పవార్(50), కోహినూర్ నవనత్(24)లను అరెస్టుచేశాం. విచారణలో ఏపీలోని రేణిగుంట, తాడిపత్రి, మంత్రాలయం, మానవపాడు, ముంగిలిపట్టు, పూతలపట్టు,సిద్దంపల్లె ప్రాంతాలతోపాటు తెలంగాణ రాష్ట్రంలో జరిగిన అనేక దోపిడీ కేసుల్లో వీరిపాత్ర ఉన్నట్లు ఒప్పుకున్నారు. ముఠాలో మిగిలిన సభ్యులనూ అరెస్టు చేసి వారివద్ద వున్న 242గ్రాముల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకుంటాం' అని రైల్వే ఎస్పీ రాహుల్ మీనా వివరించారు. దోపిడీ ముఠా సభ్యులిద్దరిని పట్టుకోవడానికి కృషిచేసిన రేణిగుంట ఐఆర్పీలు యతీంద్ర, సుధాకరరెడ్డి, ఆర్పీఎస్‌ఐలు ప్రవీణ్‌కుమార్, ధర్మేంద్రరాజు, సిబ్బంది నాగాంజనేయులు, రేవంత్, నరేంద్ర, గణేష్, నాగరాజ, లోకేష్, వినోద్, మానెయ్య, ఏలుమలైలను రైల్వే ఎస్పీ రాహుల్ మీనా ప్రత్యేకంగా అభినందించారు.

జిల్లాకో మోడల్ ఎస్పీఎం కేంద్రం

- రాష్ట్రంలోనే తొలిసారిగా చిత్తూరులో ఏర్పాటు
- ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతులకు కొత్త టెక్నాలజీ
- సదరన్ డిస్కం సీఎండీ సంతోషరావు

చిత్తూరు రూరల్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మోడల్ స్పెషల్ మెయింటనెన్స్ ఆఫ్ ట్రాన్స్‌ఫార్మర్స్ (ఎస్పీఎం) కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నట్లు సదరన్ డిస్కం సీఎండీ సంతోషరావు తెలిపారు. రాష్ట్రంలోనే తొలిసారిగా చిత్తూరులో ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేశామని చెప్పారు. సోమవారం ఈ కేంద్రాన్ని ఆయన పరిశీలించి, ప్రసంగించారు. ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతులకు కొత్త టెక్నాలజీని తీసుకొచ్చామని, మెరుగ్గా పనిచేస్తోందని చెప్పారు. ఆయిల్ రీజనరేషన్ మిషన్ అనే కొత్త టెక్నాలజీతో రెండు గంటల్లోనే వెయ్యి లీటర్ల ఆయిల్‌ను నాణ్యతతో ఫిల్టర్ చేస్తున్నామన్నారు. దీని ద్వారా ట్రాన్స్‌ఫార్మర్ల మన్నిక కాలం పెరుగుతుందని తెలిపారు. దీనివల్ల సమయం, డబ్బు ఆదా అవుతాయన్నారు. చిత్తూరు మోడల్ ఎస్పీఎం కేంద్రంలో రూ.40లక్షలతో పైలట్ ప్రాజెక్టుగా ఈ టెక్నాలజీ తీసుకొచ్చామని.. సత్ఫలితాలు ఇస్తోందని వెల్లడించారు. అనంతరం అధికారులతో మాట్లాడుతూ.. ఏఈలు పని చేసే చోట్ల నివాసం ఉండడం లేదన్నారు. దీనివల్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడిన సమయంలో అందుబాటులోకి రావడం లేదన్న ఫిర్యాదులు వస్తున్నాయని అసహనం వ్యక్తం చేశారు. ఇకపై అలా కుదరదని ఏఈలు ఆయా కేంద్రాల్లో తప్పనిసరిగా నివాసం ఉండాలని.. లేకుంటే చర్యలు తీసుకోవాలని ఎస్ఈ ఇస్మాయిల్ అహ్మద్‌ని ఆదేశించారు. అనంతరం స్టోర్స్‌ని పరిశీలించారు. స్టోర్స్‌లో వాహనాల రాకపోకలకు రోడ్డు వేయాలని సూచించారు. విద్యుత్ శాఖ డైరెక్టర్ గురవయ్య, సీజీఎం జానకిరామ్, ఈఈ మునిచంద్ర, డీఈలు పాల్గొన్నారు.



చిత్తూరు స్టోర్స్‌ను పరిశీలిస్తున్న సీఎండీ సంతోషరావు

హౌసింగ్ పీడీ గోపాల్ నాయక్ సస్పెన్షన్



చిత్తూరు, జూలై 14 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు జిల్లా ఇన్‌ఛార్జి హౌసింగ్ పీడీ భుక్యా గోపాల్ నాయక్‌ను ప్రభుత్వం సస్పెండ్ చేసింది. ఆయనతో పాటు అన్నమయ్య జిల్లా హౌసింగ్ పీడీ వి.సాంబశివయ్య కూడా సస్పెండయ్యారు. గోపాల్ నాయక్ గతంలో పీలేరులో హౌసింగ్ డీఈఈగా, రాయచోటి ఈఈగా పనిచేశారు. ఈ ఏడాది జనవరి నుంచి చిత్తూరు జిల్లా హౌసింగ్ పీడీగా విధులు నిర్వర్తిస్తున్నారు.గోపాల్ నాయక్, సాంబ శివయ్య గతంలో అన్నమయ్య జిల్లా రాయచోటిలో పని చేస్తుండగా తమ సబార్డినేట్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగి అనగాని శ్రీహరిని బదిలీ చేయకుండా ఉంచేందుకు లంచం డిమాండ్ చేశారని వచ్చిన అవినీతి ఆరోపణలు రుజువు కావడంతో ఏసీబీ డైరెక్టర్ జనరల్ ఇచ్చిన నివేదిక ఆధారంగా వారిద్దరినీ సస్పెండ్ చేస్తూ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు.

మరింత మెరుగ్గా పారిశుధ్య పనులు



డ్రైనేజీలను పరిశీలిస్తున్న కమిషనర్ మౌర్య

తిరుపతి, జూలై14(ఆంధ్రజ్యోతి) : నగరంలో పారిశుధ్య పనులు మరింత మెరుగ్గా చేపట్టాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య అధికారులను ఆదేశించారు. సోమవారం నగరంలోని మాదవనగర్, మధురానగర్ తదితర ప్రాంతాల్లో ప్రజల నుంచి అందిన ఫిర్యాదుల మేరకు పారిశుధ్య, ఇంజినీరింగ్ పనులను పరిశీలించారు. కమిషనర్ మాట్లాడుతూ ఉదయం 6 గంటల్లోపే నగరంలోని అన్ని ప్రాంతాల్లో చెత్త కుప్పలు తొలగించాలన్నారు. వర్షం కురిసిన సమయంలో మురుగునీరు రోడ్లపైకి వస్తోందని ఫిర్యాదులు వస్తున్నాయని, పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. కాలువల్లో చెత్త, మట్టి లేకుండా తొలగించేలా చూడాలన్నారు. రోడ్లపై గుంతలను పూడ్చాలన్నారు. చెత్త తరలించే వాహనాల రాకపోకల సమయాలను నమోదు చేసిన రికార్డులను పరిశీలించారు. కమిషనర్ వెంట డీఈ రమణ, రెవెన్యూ ఆఫీసర్ రవి, సర్వేయర్ కోటేశ్వరరావు, శానిటరీ సూపర్‌వైజర్ సుమతి ఉన్నారు.

టీటీడీ ఆలయాల్లో రేపు ఆణివార ఆస్థానం

తిరుపతి అర్బన్, జూలై 14(ఆంధ్రజ్యోతి): స్థానిక గోవిందరాజస్వామి, కోదండరామాలయాల్లో బుధవారం ఆణివార ఆస్థానం నిర్వహించనున్నారు. ఆణిమాసం చివరి రోజున నిర్వహించే కొలువు కావడంతో దీనికి ఆ పేరు వచ్చింది. గోవిందరాజస్వామి ఆలయంలో బంగారువాకిలి వద్ద శ్రీదేవి, భూదేవి సమేత గోవిందుడిని వేంచేపు చేసి ఆస్థానం నిర్వహిస్తారు. ఈ సందర్భంగా పుండరీకవల్లి అమ్మవారి ఆలయం నుంచి నూతన వస్త్రాలను విమాన ప్రదక్షిణగా స్వామివారికి సమర్పిస్తారు. కోదండరామాలయంలో గరుడాళ్వార్ అభిముఖంగా సీతాలక్ష్మణ సమేత రాములవారిని వేంచేపు చేసి ప్రత్యేక ఆస్థానం నిర్వహిస్తారు. అనంతరం నూతన వస్త్రాలను మూలవర్లకు, ఉత్సవర్లకు అలంకరిస్తారు.

రాష్ట్రస్థాయి చదరంగం పోటీల్లో సత్తా



నగదు బహుమతి, ట్రోఫీ అందుకుంటున్న గురువర్షిణి

తిరుపతి(క్రీడలు), జూలై 14(ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం వేదికగా శని, ఆదివారాల్లో జరిగిన అండర్ 19 ఓపెన్ అండ్ గర్ల్స్ చెస్ చాంపియన్‌షిప్ రాష్ట్రస్థాయి పోటీలో తిరుపతికి చెందిన వి.గురువర్షిణి సత్తా చాటింది. బాలికల విభాగంలో ఏడు రౌండ్లకు 6పాయింట్లతో 4వ స్థానంలో నిలిచింది. రూ. 5వేలు నగదు బహుమతి, ట్రోఫీ అందుకుంది. త్వరలో జరిగే జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించింది. బాలికను పలువురు అభినందించారు.

ఏడాది కాలంలో ఏం చేశారో అడగండి



ప్రజలతో మాట్లాడుతున్న అభినయ్

తిరుపతి(జీవకోన), జూలై 14 (ఆంధ్రజ్యోతి): ఏడాది కాలంలో ఎన్ని పథకాలు ఇచ్చారో..ఏమి అభివృద్ధి పనులు చేపట్టారో పాలకులను అడగాలని వైసీపీ తిరుపతి నియోజకవర్గ సమన్వయకర్త భూమన అభినయ్ తిమ్మినాయుడుపాళెం యాదవ కాలనీ వాసులకు చెప్పారు. సోమవారం ఆ కాలనీలో రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి పథకాల అమలు గురించి ఆరా తీశారు. పథకాలు రానివారు పాలకులను నిలదీయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ నగర అధ్యక్షుడు మల్లం రవిచంద్రారెడ్డి, కార్పొరేటర్లు ఆదం రాధాకృష్ణారెడ్డి, బోకం అనిల్‌కుమార్, తజిన్, ఉదయవంశీ, సుశీల, రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంకటహర చతుర్దశి వేడుకలు



అలంకారంలో వినాయకుడు

తిరుపతి(జీవకోన), జూలై 14 (ఆంధ్రజ్యోతి): వినాయకసాగర్ వద్ద ఉన్న సంకల్ప వరసిద్ధి వినాయకస్వామి ఆలయంలో సోమవారం సంకటహర చతుర్థి వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్వామివారికి ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఈ కార్యక్రమంలో పురోహితులు సురేష్‌స్వామి, ధర్మకర్త చెంగారెడ్డి, సభ్యులు గుండాల గోపినాథ్‌రెడ్డి, నాదమునిరెడ్డి, తొండమనాటి సుబ్రహ్మణ్యం, శాంతిప్రియ, రత్నజ, కిశోర్‌రెడ్డి, వాసు, తన్విష్ పాల్గొన్నారు.

పోలీసు పీజీఆర్ఎస్‌కు 113 వినతులు



ప్రజల సమస్యలు వింటున్న ఎస్పీ హర్షవర్ధనరాజు

తిరుపతి(నేరవిభాగం), జూలై 14(ఆంధ్రజ్యోతి): ఎస్పీ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 113 వినతులు వచ్చాయి. అర్జీదారులతో ఎస్పీ హర్షవర్ధనరాజు నేరుగా మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. వాటిని ఆయా స్టేషన్లకు పంపించి, నిర్ణీత సమయం లోపు పరిష్కరించాలని ఆదేశించారు. కొన్ని స్టేషన్లలో సీఐ, ఎస్ఐలు సమస్యల గురించి పట్టించుకోవడం లేదని ఫిర్యాదులు రావడంతో అలాంటి వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు రవిమనోహరాచారి, నాగభూషణరావు, ఎస్పీ సీసీ సాధిక్ ఆలీ, సీఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

అమరరాజాలో పోలీసులకు ఉచిత వైద్య శిబిరం



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎస్పీ హర్షవర్ధనరాజు, డాక్టర్ రమాదేవి

రేణిగుంట, జూలై 14(ఆంధ్రజ్యోతి): అమరరాజా గ్రూప్స్ అమరా హాస్పిటల్, కాంటినెంటల్ కాఫీ సంయుక్తంగా తిరుపతి జిల్లా పోలీస్ సిబ్బందికి ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. సోమవారం కరకంబాడిలో ఉన్న అమరరాజా ఆడిటోరియంలో జరిగిన ఈ వైద్య శిబిరాన్ని ఎస్పీ హర్షవర్ధన్‌రాజు, అమర హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రమాదేవి ప్రారంభించారు. ఈ మెగా వైద్య శిబిరానికి పెద్దఎత్తున జిల్లాలోని పోలీసు అధికారులు, సిబ్బంది హాజరై వివిధ పరీక్షలను చేయించుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీసులకు ఉచిత వైద్యం అందిస్తున్న అమరా హాస్పిటల్, కాంటినెంటల్ కాఫీ వారికి ధన్యవాదాలు తెలిపారు. మేనేజింగ్ డైరెక్టర్ రమాదేవి గౌరినేని మాట్లాడుతూ ప్రజా రక్షణలో పడి పోలీసులు తమ ఆరోగ్యాన్ని పట్టించుకోలేక పోతున్నారన్నారు. అలాంటి వారికి ఆరోగ్య శిబిరం ఏర్పాటు చేయడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు రవిమనోహరాచారి, చంద్రశేఖర్, డీఎస్పీ శ్రీనివాసరావు, ఎస్ఐలు, ఆర్ఐలు, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ






పవన్‌కల్యాణ్ - మోహిత్

తిరుపతి(క్రీడలు), జూలై 14(ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా నరసారావుపేటలో రెండు రోజులు జరిగిన రాష్ట్రస్థాయి మోడ్రన్ పెంటథ్లాన్ లేజర్ రన్ చాంపియన్‌షిప్‌లో తిరుపతికి చెందిన క్రీడాకారులు ప్రతిభ కనబరిచారు. పురుష విభాగంలో జి.పవన్‌కల్యాణ్ (సిల్వర్), అండర్ 19మెన్ విభాగంలో కె.షునీత్(బ్రాంజ్), అండర్ 15బాలుర విభాగంలో కె.మోహిత్(సిల్వర్) మెడల్స్ కైవసం చేసుకున్నారు. ఆగస్టులో బీహార్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించారు. వారిని ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మోనిక, ఇతర క్రీడా ప్రముఖులు అభినందించారు.

అందరి కృషితోనే స్వచ్ఛ అవార్డు

- కమిషనర్‌కు పలువురి అభినందనలు
- ఇదే స్ఫూర్తితో ముందుకెళ్లాలని పిలుపు



కమిషనర్‌ను అభినందిస్తున్న డిప్యూటీ మేయర్లు మునికృష్ణ, ముద్ర నారాయణ

తిరుపతి, జూలై14(ఆంధ్రజ్యోతి) : స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డుకు తిరుపతి నగరపాలక సంస్థ ఎంపిక కావడంతో కమిషనర్ ఎన్.మౌర్యను కూటమి నాయకులు అభినందించారు. సోమవారం కమిషనర్ చాంబర్‌లో డిప్యూటీ మేయర్లు ఆర్సీ మునికృష్ణ, ముద్ర నారాయణ, కార్పొరేటర్ నరసింహాచారి శాలువా, పుష్పగుచ్ఛాన్ని అందించి ప్రశంసించారు. 3 లక్షల జనాభా కేటగిరీలో తిరుపతి నగర కార్పొరేషన్ సూపర్ స్వచ్ఛ లీగ్‌ను కైవశం చేసుకున్న విషయం తెలిసిందే. ఈనెల 17న ఢిల్లీలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా అవార్డు అందుకోనున్నారు.

- **పీజీఆర్ఎస్‌కు 43 వినతులు**

నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన డయల్ యువర్ కమిషనర్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 43 వినతులు వచ్చాయని కమిషనర్ మౌర్య తెలిపారు. వార్డుల్లో సమస్యలు పరిష్కరించాలని డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ కోరారు. సంజయ్‌గాంధీ కాలనీలో మురుగునీటి కాలువలు శుభ్రం చేయాలని, కొర్లగుంట, మధురా నగర్‌లో సీసీ రోడ్లు వేయాలని, సుందరయ్య నగర్‌లో చెట్ల కొమ్మలు తొలగించాలని, దివ్యాంగుల పింఛన్ ఇప్పించాలని, కోటకొమ్మల వీధిలోని అన్నమయ్య హోటల్ వద్ద పరిశరాలు శుభ్రం చేయించాలని, గిరిపురం మెయిన్ రోడ్డులో కాలువ పూడిక తీసి నిర్మాణం చేయాలని, శివజ్యోతి నగర్‌లో ఖాళీ స్థలం కోర్టులో ఉన్నా కొంతమంది అక్రమంగా నిర్మాణాలు చేస్తున్నారని, నెహ్రూనగర్‌లో టీకేటీ భూమిలో నిర్మాణాలు చేస్తున్నారని, తిమ్మినాయుడు పాలెంలో తెలుగుగంగ నీరు ఇప్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ అమరయ్య, సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, మునిసిపల్ ఇంజినీర్లు తులసికుమార్, గోమతి, రెవెన్యూ అధికారి రవి, డీసీపీ ఖాన్, వెటర్నరీ ఆఫీసర్ డాక్టర్ నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు మంచి రోజులు

- తొలి అడుగులో టీడీపీ నేతలు



ప్రభుత్వ పథకాల గురించి వివరిస్తున్న టీడీపీ నేతలు

తిరుపతి, జూలై14(ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వంతో మహిళలకు మంచి రోజులు వచ్చాయని, పింఛన్, ఉచిత గ్యాస్ సిలిండర్లు, తల్లికి వందనం పథకాలు అందుతున్నాయని, త్వరలోనే ఆర్టీసీలో ఉచిత ప్రయాణం అందుబాటులోకి వస్తుందని టీడీపీ నేతలు చెప్పారు. ఏడాది పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా నియోజకవర్గ ఇన్‌చార్జి మన్నూరు సుగుణమ్మ ఆధ్వర్యంలో 44వ డివిజన్ సుందరయ్యనగర్‌లో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం చేపట్టారు. ప్రభుత్వం ఏడాది కాలంలో అమలు చేసిన పథకాలను ఇంటింటికీ వెళ్లి ప్రజలకు వివరించారు. టీటీడీ పాలకమండలి సభ్యురాలు పనబాక లక్ష్మి మాట్లాడుతూ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి లోకేష్ బాబు సారథ్యంలో ఏపీ కొత్త చరిత్ర సృష్టిస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్, క్లస్టర్ ఇన్‌చార్జి ఆర్సీ మునికృష్ణ, యూనిట్ ఇన్‌చార్జి ఊట్ల సురేంద్ర నాయుడు, నాయకులు పాటకం వెంకటేష్, శంకరణ్, ధనుంజయ, మునిరత్నం నాయుడు, వాణి, జయంతి, రాజన్న, వెంకటముని, మల్లికార్జున పాల్గొన్నారు.

వివక్షకు పాల్పడిన అధికారిపై చర్యలు తీసుకోండి

- **వెటర్నరీ వర్సిటీ వీసీకి దళిత సంఘాల నేతల వినతి**



ఇన్‌చార్జి వీసీ రమణకు విన్నవిస్తున్న దళిత సంఘాల నేతలు

తిరుపతిరూరల్, జూలై14(ఆంధ్రజ్యోతి): ఎస్వీ వెటర్నరీ వర్సిటీ పరిధిలోని డెయిరీ టెక్నాలజీ కళాశాలలో ఇటీవల దళిత అధ్యాపకుడు రవివర్మ(కాంట్రాక్ట్)పట్ల వివక్షకు పాల్పడిన అధికారి డాక్టర్ రవీంద్రారెడ్డిపై వెంటనే చర్యలు తీసుకోవాలని అంబేడ్కర్ యువజన సంఘం, దళిత సంఘాల నేతలు కోరారు. ఈ మేరకు సోమవారం అంబేడ్కర్ యువజన సంఘ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు తాళ్లపాక దాముతో కలిసి పలువురు దళిత సంఘాల నేతలు ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ జేవీ రమణను కలిసి వినతిపత్రం సమర్పించారు. వారు మాట్లాడుతూ వర్సిటీలో పనిచేసే ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులకు అవమానం జరుగుతున్నా ఉన్నతాధికారులు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. దళిత అధ్యాపకుడి కుర్చీని తీసేసి వివక్షకు పాల్పడిన ఏడీపై ఇప్పటి వరకూ చర్యలు చేపట్టకపోవడంలో ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. హైకోర్టు ఆర్డర్ ప్రకారం రవివర్మను రెగ్యులరైజ్ చేయాలని కోరారు. వర్సిటీలో ఓ అధికారి ఫేక్ అపాయింట్‌మెంట్‌తో ఉన్నత పదవిలో కొనసాగుతున్నారని, ఆయన్ను విధుల నుంచి తొలగించి శాలరీని రికవరీ చేయాలని కోరారు. లేనిపక్షంలో సంఘ ఆధ్వర్యంలో సీబీఐకి ఫిర్యాదు చేస్తామని పేర్కొన్నారు. స్పందించిన వీసీ మాట్లాడుతూ కమిటీ నివేదిక ఆధారంగా తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

డ్రగ్స్ నివారణపై 16 నుంచి అవగాహన కార్యక్రమాలు



పోస్టర్లు విడుదల చేస్తున్న వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూలై 14 (ఆంధ్రజ్యోతి): డ్రగ్స్ నివారణపై ఈనెల 16 నుంచి 23వ తేదీ వరకు ఎస్వీ యూనివర్సిటీలో అవగాహన కార్యక్రమాలు చేపట్టనున్నారు. యూనివర్సిటీ స్టూడెంట్ వెల్ఫేర్ అండ్ కల్చరల్ అఫైర్స్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. దీనికి సంబంధించిన పోస్టర్లను ఎస్వీయూ వీసీ ప్రొఫెసర్ అప్పారావు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ భూపతి నాయుడు, స్టూడెంట్ వెల్ఫేర్ డైరెక్టర్ ప్రొఫెసర్ మురళీధర్, కల్చరల్ అఫైర్స్ కో-ఆర్డినేటర్ డాక్టర్ పత్తిపాటి వివేక్ చౌదరి, పరీక్షల డీన్ ప్రొఫెసర్ కొంగర సురేంద్రబాబు ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ సమాజంలో సకల నేరాలకు డ్రగ్స్ కారణమవుతున్నాయని తెలిపారు. ముఖ్యంగా విద్యార్థులు, యువత డ్రగ్స్‌కు బానిసలవుతున్నారని చెప్పారు. యూనివర్సిటీ కాలేజీలు, అనుబంధ కాలేజీల్లో డ్రగ్స్ నివారణపై ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించేందుకు ప్రణాళిక రూపొందించామన్నారు. ఇందులో విద్యార్థులు, ఉద్యోగులు భాగస్వామ్యం వహించాలన్నారు. డ్రగ్స్ నివారణ పట్ల సామాన్య ప్రజల్లోనూ అవగాహన కల్పించడానికి ప్రయత్నించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో దూరవిద్యా డైరెక్టర్ ప్రొఫెసర్ ఊకా రమేష్‌బాబు, సీప్ స్టడీస్ ప్రొఫెసర్ ప్రయాగ, లైబ్రరీ ఉద్యోగి శేఖర్ పాల్గొన్నారు.

తెలుగువారి ఆత్మగౌరవం నుంచి పుట్టిందే టీడీపీ

- **మాజీ మంత్రి టీజీ వెంకటేష్**



నిత్యాన్నదాన సత్రం భవనాన్ని ప్రారంభిస్తున్న వెంకటేష్, ఎమ్మెల్యే ఆరణి

తిరుపతి(జీవకోన), జూలై 14(ఆంధ్రజ్యోతి): తెలుగువారి ఆత్మగౌరవం నుంచి పుట్టిందే తెలుగుదేశం పార్టీ అని మాజీ మంత్రి, మాజీ పార్లమెంటు సభ్యులు టీజీ వెంకటేష్ అన్నారు. సోమవారం తిరుపతి సత్యనారాయణపురం సర్కిల్ సమీపంలోని వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో నిత్యాన్నదాన సత్రం భవనాన్ని ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ హిందువుల ఆత్మగౌరవం కోసం బీజేపీ పుడితే, తెలుగువారి కోసం టీడీపీ ఏర్పడిందని పేర్కొన్నారు. ఆర్యవైశ్యులు ఆత్మగౌరవంతో సేవా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ అభివృద్ధికి సహకారం అందజేస్తామన్నారు. వివాదంలో ఉన్న సీతమ్మ ట్రస్టు భూములను విడిపించి క్లబ్‌కు అందజేస్తామని తెలిపారు. ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మాట్లాడుతూ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించే సేవా కార్యక్రమాల్లో తాము కూడా భాగస్వాములమవుతున్నామని తెలిపారు. వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ అధ్యక్షుడు రామకృష్ణ మాట్లాడుతూ ఆర్యవైశ్యుల అభ్యున్నతికి అండగా ఉంటామని, భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. ప్రతినిధులు వెంకటేశ్వర్, సూర్యప్రకాష్, శ్రీనివాస్, నాగేశ్వరరావు, సుజాత, ఆర్యవైశ్య ప్రతినిధులు పాల్గొన్నారు.

కాజేసిన డ్వాక్రా మహిళల సొమ్మును రికవరీ చేయాలి



ఇండియన్ బ్యాంక్ ఎదుట ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు

తిరుపతి(ఆటోనగర్), జూలై 14(ఆంధ్రజ్యోతి): నగర పరిధిలో డ్వాక్రా సంఘాల మహిళల నుంచి మెప్మా రీసోర్స్ పర్సన్ (ఆర్‌పీ) లత కాజేసిన కోటి రూపాయలను రికవరీ చేయాలని, ఆమెకు సహకరించిన బ్యాంక్ సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకోవాలని సీపీఐ జిల్లా కార్యవర్గ దర్శి సభ్యులు సి.పెంచలయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు బైరాగిపట్టెడలోని ఇండియన్ బ్యాంక్ ఎదుట సోమవారం సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఆయన మాట్లాడుతూ నగరంలోని 34 సంఘాల నుంచి నెలకు లక్ష రూపాయలు వసూలు చేసి బ్యాంక్ తప్పుడు సీలును రసీదులపై ముద్రించి మోసం చేసిందన్నారు. మోసానికి పాల్పడిన లతను అరెస్ట్ చేయాలన్నారు. ఆమెకు సహకరించిన బ్యాంక్, మెప్మా సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. డబ్బులు వసూలు చేసి బ్యాంక్‌లో జమ చేస్తామని, ఉద్యోగులపై చర్యలు తీసుకుంటామని మెప్మా సీఈవో, బ్యాంక్ మేనేజరు హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. సీపీఐ ఆందోళనకు వైసీపీ తిరుపతి నియోజకవర్గ ఇన్‌చార్జ్ భూమన అభినయరెడ్డి మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు విశ్వనాథ్, రాధాకృష్ణ, ఉదయ్‌కుమార్, హరికృష్ణ, అల్లాబక్ష్, రత్నమ్మ, విజయ, మల్లాం రవిచంద్రారెడ్డి, పి.సురేష్, వెంకటేష్, ఇమ్రాన్ పాల్గొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధికే చేతివృత్తులు



శిక్షణను ప్రారంభిస్తున్న మోహన్

తిరుపతి(ఆటోనగర్), జూలై 14 (ఆంధ్రజ్యోతి): మహిళలు చేతివృత్తులు నేర్చుకోవడం వల్ల కుటుంబాలను ఆర్థికంగా అభివృద్ధి చేసుకోవచ్చునని రాస్ జనశిక్షణ సంస్థ డైరెక్టర్ మోహన్ అన్నారు. స్థానిక శివజ్యోతినగర్‌లో సోమవారం రాస్ జనశిక్షణ సంస్థ ఆధ్వర్యంలో రాస్ పొదుపు మహిళలకు మూడు నెలల బ్యూటీషియన్ కోర్సును ఆయన ప్రారంభించారు, ఆయన చేతి వృత్తులపై అవగాహన కల్పించారు. వాటివల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. మారుతున్న నాగరికతకు అనుగుణంగా ఈ కోర్సు ఉపయోగపడుతోందని తెలిపారు. బాలాజీ, సుధాకర్‌రెడ్డి, గీత, రాజేశ్వరి పాల్గొన్నారు.


బైరెడ్డి శబరి

శ్రీవారిసేవలో ప్రముఖులు

తిరుమల, జూలై14(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని సోమవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. ఎంపీ బైరెడ్డి శబరి, మాజీ మంత్రి అవంతి శ్రీనివాస్, కర్ణాటక మంత్రి లక్ష్మీ హెబ్బాల్కర్ ఉన్నారు.

శంకర్‌రెడ్డి ఇన్‌చార్జి కాదు: ఎమ్మెల్యే

సత్యవేడు, జూలై 14 (ఆంధ్రజ్యోతి): టీడీపీ అధిష్ఠానం సత్యవేడుకు నూతనంగా నియమించిన కూరపాటి శంకర్‌రెడ్డి నియోజకవర్గానికి ఇన్‌ఛార్జి కాదని, ఆయన కేవలం పార్టీ ప్రోగ్రామ్స్‌కో ఆర్డినేటర్ మాత్రమేనని ఎమ్మెల్యే ఆదిమూలం చెప్పారు. ఈ మేరకు నియామక పత్రంలో స్పష్టంగా ఉందన్నారు. సత్యవేడులో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. శంకర్‌రెడ్డిని నియోజకవర్గ ఇన్‌ఛార్జి అంటూ కొందరు సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెడుతున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజ్యాంగబద్ధంగా ఎన్నికైన ఎమ్మెల్యే స్థానంలో ఎవరినీ ఇన్‌ఛార్జిగా నియమించలేరన్నారు. శంకర్‌రెడ్డి తనకు మిత్రుడు, సన్నిహితుడంటూనే.. కూటమిలోని నాయకులను, కార్యకర్తలందరినీ కలుపుకొంటూ నియోజకవర్గ అభివృద్ధిపై చర్చించుకుని ముందుకు వెళ్లాలని సూచించారు. ఎమ్మెల్యేను వదిలేసి తిరిగితే ఎవరూ సహకరించరన్నారు. నియోజకవర్గానికి వస్తూనే ఫ్లెక్సీలు, అంగబలంతో బలప్రదర్శన చేయడం దేనికోసమన్నారు. ఆయనకు అధికారులు ఎస్కార్ట్‌తో స్వాగతం పలకడం, సెల్యూట్‌లు కొట్టడం ఎందుకని పోలీసులను ప్రశ్నించారు. దీనిపై ఎస్పీకి ఫిర్యాదు చేశానన్నారు. అధికారులను బెదిరిస్తున్నారని ఆరోపించారు.

వడ్డీ సహా రూ.20 లక్షలు ఎల్‌ఐసీకి జమ

నాయుడుపేట/టౌన్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట ఎల్‌ఐసీలో ఒకరి బీమా పాలసీకి సంబంధించి మరొకరి ఖాతాకు 19,87,500 రూపాయలు జమ అయిన ఘటనలో అధికారులు విచారించారు. ఈ మేరకు 9 శాతం వడ్డీతో పాటు ఆ వ్యక్తి నుంచి సోమవారం ఎల్‌ఐసీకి రూ.20 లక్షలు జమ చేయించారు. కాగా, రికార్డులు తారుమారు చేసిన అధికారులు.. బాధ్యుడైన వ్యక్తి విషయంలో ఎలాంటి చర్యలు తీసుకోనున్నారో అంతుపట్టడం లేదు. ఇంత జరిగినా పోలీసులకూ ఫిర్యాదు చేయకపోవడం గమనార్హం.

సర్వదర్శనానికి 15 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 15 గంటల సమయం పడుతోంది. సోమవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్‌2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలో 9 షెడ్లలో సర్వదర్శన భక్తులు నిండిపోయి క్యూలైన్ శిలాతోరణం సర్కిల్ వరకు వ్యాపించింది. వైకుంఠం క్యూకాంప్లెక్స్‌1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

శనివారం హుండీ ఆదాయం: రూ.4.43 కోట్లు

ఆదివారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 80,193

తలనీలాలు సమర్పించినవారు: 33,298



ప్రోగ్రెస్ రిపోర్ట్

వెంకటగిరి తెరమీదకు కురుగొండ్ల రామకృష్ణ వారసురాలు వచ్చారని 2024లో అంతా అనుకున్నారు. ఆయన కూడా కుమార్తెను నడిపించే బాధ్యత తీసుకున్నారు. అయితే రాజకీయ పరిస్థితుల వల్ల అనూహ్యంగా మళ్లీ రామకృష్ణకే టికెట్ ప్రకటించడంతో మూడోసారి ఆయన వెంకటగిరి ఎమ్మెల్యే అయ్యారు. రోజూ ఉదయం 6 నుంచీ అర్ధరాత్రి దాకా నియోజకవర్గంలో పర్యటిస్తూనే వుంటారు. సమస్యలపై వచ్చిన ప్రజలను ఏ పార్టీ అని అడగరు. సమస్య మాత్రమే అడిగి వేగంగా స్పందిస్తారు. పని పూర్తయిందా లేదా అని ఫాలోఅప్ కూడా చేస్తారు. వెనుకబడిన వెంకటగిరి నియోజకవర్గం అభివృద్ధికి ఆయన ఈ ఏడాదిలో ఏం చేశారు? ఏం చేయలేకపోయారు? ఇంకా చేయాల్సినవి ఏమిటి? మలి ఏడాది లక్ష్యాలుగా ఏవి నిర్దేశించుకున్నారు.. ఈ అంశాల సమాహారం...

- కథనం, ఇంటర్వ్యూ : తిరుపతి, ఆంధ్రజ్యోతి



వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ

ఏడాదిలో ఏం చేశారు?

పరిశ్రమలపైనే దృష్టి

- రూ. 560 కోట్లతో జల్‌జీవన్ మిషన్ ● వెంకటగిరిలో వంద పడకల ఆస్పత్రి...
- డయాలసిస్, ట్రామా కేర్ సెంటర్లకు ప్రతిపాదన
- ఏడాదిలో ఆల్తూరుపాడు, టెక్స్‌టైల్ పార్కు మంజూరు చేయిస్తా!

వంద కోట్లతో అభివృద్ధి పనులు :

నియోజకవర్గంలో ఏడాది కాలంలో ఆర్ అండ్ బీ, పంచాయతీ రాజ్, ఇరిగేషన్, ఉపాధి హామీ, ఆర్ డబ్ల్యుఎస్ తదితర శాఖల ద్వారా సుమారు రూ. వంద కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టారు. అందులో 90 శాతం పనులు పూర్తి అయ్యాయి. పది శాతం పనులు పురోగతిలో వున్నాయి.



బాలాయపల్లి మండలం కడగుంట గ్రామంలో నిర్మించిన సీసీ రోడ్డు



రాపూరు మండలం లక్ష్మీపురంలో నిర్మించిన సీసీ రోడ్డు



కలువాయి వెంకయ్య స్వామి గుడి వీధిలో నిర్మించిన సీసీ రోడ్డు

ఆర్ అండ్ బీ పనులు:

వెంకటగిరి, డక్కిలి, బాలాయపల్లి మండలాల పరిధిలో రూ. 5.81 కోట్లు, కలువాయి మండలంలో రూ. 4.75 కోట్లు, సైదాపురం మండలంలో రూ. 47.46 కోట్లు, రాపూరు మండలంలో రూ. 1.16 కోట్లు చొప్పున మొత్తం రూ. 59.16 కోట్లతో రోడ్ల విస్తరణ, అభివృద్ధి, మరమ్మతు పనులు జరిగాయి.

ఇరిగేషన్ పరిధిలో :

ఎస్‌డీఎంఎఫ్ కింద రూ. 50 లక్షలతో 6 పనులు, ఎఫ్‌డీఆర్-2024 కింద రూ. 9.85 కోట్లతో 156 పనులు, ఓ అండ్ పి కింద రూ. 42 లక్షలతో 15 పనులు చొప్పున మొత్తం రూ. 10.77 కోట్లతో 177 పనులు చేపట్టం జరిగింది. ఆర్‌డబ్ల్యుఎస్ శాఖ ద్వారా రూ. 1.61 కోట్లతో 237 పనులు జరిగాయి.

- పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖ ద్వారా రూ. 18.82 కోట్లతో 318 పనులు చేపట్టారు. ● జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద రూ. 9.06 కోట్లతో 3822 పనులు చేపట్టారు.



మరమ్మతుల అనంతరం బాగుపడిన రాపూరు మండలం మద్దెలమడుగు నుంచి గూడూరు వెళ్లే రోడ్డు



డక్కిలిలో నూతనంగా నిర్మించిన పీహెచ్‌సీ భవనం



వెంకటగిరి-యాతలూరు మార్గంలో నిర్మించిన తారు రోడ్డు

పేరు: కురుగొండ్ల రామకృష్ణ (63)
భార్య: సింధు, కుమార్తె: లక్ష్మీసాయి ప్రియ
స్వస్థలం: పాతనాల పాడు, డక్కిలి మండలం

ఎమ్మెల్యే ఏమంటున్నారంటే..

? నెల్లూరు జిల్లా నుంచి విడిపోయి తిరుపతిలో సగం కలిసిన వెంకటగిరి నియోజకవర్గం అభివృద్ధిలో వెనుకబడే ఉంది. ఈ విషయంలో మీరు చేస్తున్న ప్రయత్నాలు ఏమిటి?

! వెంకటగిరి నియోజకవర్గంలోని ప్రధాన సమస్యలన్నింటినీ సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్ళాను. ఇరిగేషన్ శాఖకు సంబంధించి తెలుగుగంగ ప్రాజెక్టులో చెన్నై కెనాల్ నుంచీ నాలుగు చోట్ల లిఫ్ట్ ఇరిగేషన్ ఏర్పాటు అవసరాన్ని సీఎంకు వివరించి ప్రతిపాదనలు కూడా అందజేశా. చారిత్రక ప్రాధాన్యత కలిగిన వెంకటగిరి మున్సిపల్ పట్టణంలో ప్రస్తుతమున్న ప్రభుత్వాస్పత్రి స్థాయిని వంద పడకలకు పెంచాలని కోరా. అలాగే వెంకటగిరి ప్రభుత్వాస్పత్రిలో డయాలసిస్ సెంటర్, ట్రామా కేర్ సెంటర్ ఏర్పాటు చేయాల్సిన అవసరాన్ని కూడా సీఎంకు వివరించా. జల్‌జీవన్ మిషన్ కింద వెంకటగిరి, బాలాయపల్లి, డక్కిలి మండలాల్లోని ప్రతి ఇంటికీ తాగునీటి కొళాయి ఏర్పాటు చేసే విధంగా రూ. 560 కోట్లతో వాటర్ గ్రిడ్ ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపించాం.

? వెంకటగిరి నియోజకవర్గంలో చెప్పుకోదగ్గ పరిశ్రమ ఒక్కటంటే ఒక్కటి కూడా లేదు. మీరు చేస్తున్న కృషి ఏమిటి?

! పెద్ద సంఖ్యలో ఇక్కడ ప్రభుత్వ భూములు అందుబాటులో వున్నాయి. వెంకటగిరి మండలం కుర్తేగుంటలో 1500 ఎకరాల ప్రభుత్వ భూమి వుంది. అలాగే రాపూరు మండలంలో ఏకంగా 6 వేల ఎకరాల రెవిన్యూ అటవీ భూములున్నాయి. ఈ భూముల్లో సెజ్ లేదా పారిశ్రామిక వాడలు ఏర్పాటు చేయాలని సీఎంను కోరాం.

సొంత నిధులతో పోలేరమ్మ ఆర్చి



వెంకటగిరి అంటే గుర్తొచ్చేది పోలేరమ్మ దేవత. ఏటా వైభవంగా జరిగే పోలేరమ్మ జాతరకు దేశవిదేశాల నుంచీ భక్తులు పోటెత్తి వస్తారు. వెంకటగిరిలో అడుగుపెట్టగానే పట్టణ వైభవం, పోలేరమ్మ గుర్తుకు వచ్చేలా కనిపించాలనే ఉద్దేశ్యంతో సొంత నిధులు రూ. 50 లక్షలు వెచ్చించి ఆర్చీ నిర్మాణం ప్రారంభించా. పనులు వేగంగా జరుగుతున్నాయి.

రెండో ఏడాది లక్ష్యాలు

- రెండవ ఏడాది ముగిసేలోపు అల్తూరుపాడు రిజర్వాయర్ మంజూరు చేయిస్తా. రూ.768 కోట్ల అంచనా వ్యయంతో ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపించాం. మంజూరయ్యే దశలో వుంది.
- జరీ, చేనేత పరిశ్రమకు ఆయువుపట్టులాంటి వెంకటగిరిలో వేలాది మంది నేత కార్మికులున్న కారణంగా వెంకటగిరిలో టెక్స్‌టైల్ పార్కు ఏర్పాటు చేయిస్తా. ఇప్పటికే సీఎం చంద్రబాబును కలసి ప్రతిపాదనలు అందజేశా.

ఎమ్మెల్యే ముందున్న సవాళ్లు

- అలపలేరు డ్యామ్ ఆధునీకరణ ● వెంకటగిరిలో ఇంజనీరింగ్ కాలేజ్ ఏర్పాటు
- కలువాయి చెరువు ఆధునీకరణ ● తెలుగు గంగ బ్రాంచి కెనాల్స్ నిర్మాణం
- జౌళి పరిశ్రమ ఏర్పాటుకు పాదయాత్రలో లోకేశ్ ఇచ్చిన హామీ
- వెంకటగిరి - కోడూరు రోడ్డు పనులు పూర్తి చేయడం



నాయుడుపేటలో చోరీకి గురైన బంగారు నగలు రికవరీ చేసిన పోలీసులు

పగలే ఇళ్లలో చొరబడి..!

- అంతర్రాష్ట్ర దొంగ అరెస్టు
- 416 గ్రాముల బంగారు నగలు స్వాధీనం

తిరుపతి(నేరవిభాగం), జూలై 14(ఆంధ్రజ్యోతి): పగటిపూటే ఇళ్లలోకి చొరబడి దొంగతనాలకు పాల్పడే అంతర్రాష్ట్ర నిందితుడు చందక మణికంఠను నాయుడుపేట పోలీసులు అరెస్టు చేశారు. అతడి నుంచి రూ.37.44 లక్షల విలువ చేసే 416 గ్రాముల బంగారు నగలను స్వాధీనం చేసుకున్నారు. ఈ వివరాలను సోమవారం తిరుపతిలో ఎస్పీ హర్షవర్ధనరాజు మీడియాకు వివరించారు. ఆయన తెలిపిన ప్రకారం.. పార్వతీపురం జిల్లాకు చెందిన చందక మణికంఠ డిగ్రీ వరకు బాగా చదివాడు. ఉన్నత శ్రేణిలో ఉత్తీర్ణత సాధించాడు. కష్టపడి పనిచేయడం ఇష్టంలేక ఈజీ మనీకి అలవాటు పడ్డాడు. తోటి స్నేహితులతో కలిసి మద్యానికి బానిసయ్యాడు. జీవితాన్ని ఎంజాయ్ చేయాలని భావించి పాత నేరస్థులతో కలసి దొంగతనాలకు దిగాడు. గతంలో జైలులో ఉండొచ్చిన వారితో చేతులు కలిపాడు. దొంగతనాల్లో ప్రావీణ్యం పొందాడు. ఈ క్రమంలో పార్వతీపురానికి చెందిన మహిళతో వివాహమైంది. పిల్లలు లేరు. విశాఖ పరిధిలోని మువ్వలపాలెం పోలీసు స్టేషన్ పరిధిలో మూడు ఇంటి దొంగతనాలు చేశాడు. ద్వారకాపురం స్టేషన్ పరిధిలో మరో మూడు కన్నాలేసి నేరాలకు పాల్పడ్డాడు. ఈ కేసుల్లో ఇతడిని పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు పంపగా, బెయిల్‌పై బయటకు వచ్చాడు. ఇతడిపై విశాఖ పోలీసులు సస్పెక్ట్ షీట్ ఓపెన్ చేశారు. తాజాగా తడ, నాయుడుపేట, శ్రీసిటీ, వరదయ్యపాలెం పరిధిలో పలు చోట్ల దొంగతనాలకు పాల్పడగా, కేసులు నమోదయ్యాయి. తాజాగా నాయుడుపేట పరిధిలోని ముగాంబిక దేవాలయం వీధిలోని గంగినేని హరీంద్ర ఇంటిలో దొంగతనానికి పాల్పడ్డాడు. 416 గ్రాముల బంగారు నగలు, అపహరించుకుని పరారయ్యాడు. నాయుడుపేట అర్బన్ సీఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. ఎస్పీ ఆదేశాల మేరకు డీఎస్పీ చెంచుబాబు, సీఐ ఎం.బాబి, పోలీసులు సాంకేతిక పరిజ్ఞానంతో నిందితుడి కదలికలు గుర్తించి పట్టుకున్నారు. ఇప్పటి వరకు మణికంఠపై 14 కేసులు ఉన్నాయి. నిందితుడ్ని అరెస్టు చేసి చోరీ సొత్తు రికవరీలో ప్రతిభ కనపరచిన నాయుడుపేట డీఎస్పీ చెంచుబాబు, సీఐ బాబి, ఎస్ఐ ఆదిలక్ష్మి, హెడ్ కానిస్టేబుల్ రామ్మోహన్ రాజు, కానిస్టేబుళ్లు దయాకర్, భానుతేజ, వెంకటేశ్వర్లు, డ్రైవర్ సుబ్రహ్మణ్యంను ఎస్పీ అభినందించి రివార్డులు అందచేశారు.

భూ సమస్యలు పరిష్కరించండి మహాప్రభో..!

అధికారులతో అర్జీదారుల మొర

పీజీఆర్‌ఎస్‌కు 301 వినతులు



వినతులు స్వీకరిస్తున్న జేసీ శుభం బన్సల్

తిరుపతి(కలెక్టరేట్), జూలై 14(ఆంధ్రజ్యోతి): 'భూ సమస్యలు పరిష్కరించమని చాలా వారాలుగా తిరుగుతున్నాం.. పట్టించుకోవడం లేదు.. వాటిపై దృష్టి పెట్టండి మహాప్రభో' అంటూ పలువురు అర్జీదారులు అధికారులకు మొరపెట్టుకున్నారు. సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికకు హాజరైన ప్రజలతో కలెక్టరేట్ కిక్కిరిసింది. మొత్తం 301 అర్జీలు అందగా అందులో రెవెన్యూ శాఖకు 136 వచ్చాయి. వెంటనే పరిష్కరించాలని జేసీ శుభం బన్సల్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు.

పొదుపు డబ్బులు ఆర్పీ స్వాహా చేసింది



16ఏళ్లుగా మేము పొదుపు సంఘంలో సభ్యులుగా ఉన్నాం. గత ఏడాది నవంబరు నుంచి ఈ ఏడాది జూన్ వరకు చెల్లించిన పొదుపు సొమ్ము బ్యాంకులో జమకాలేదు. ఆర్పీ లతకు డబ్బు ఇస్తే ఆమె బ్యాంకులో కట్టి రసీదు తెచ్చి ఇచ్చేది. ఇటీవల మా వద్ద ఉన్న సంఘం పుస్తకాలు, బ్యాంకు రసీదులు ఆమె తీసుకుంది. బ్యాంకుకు వెళ్లి స్టేట్‌మెంట్ చూడగా మా గ్రూపునకు సంబంధించి రూ.6.80లక్షలు జమ కాలేదని బ్యాంకు అధికారులు తెలిపారు. దీనిపై విచారించగా నేను ఒకదాన్నే సొమ్ము స్వాహా చేయలేదు. మెప్మా అధికారులు, సిబ్బందికి వాటాలు ఇచ్చానని చెప్పింది. విచారణ జరిపి న్యాయం చేయండి.

- భాగ్యలక్ష్మి సంఘం సభ్యులు, కైకాల చెరువు, తిరుపతి

మా పిల్లలకు చదువు దూరం చేయొద్దు



కేవీబీపురం మండలం పాతపాళెం హరిజనవాడలో 30 ఏళ్లుగా ప్రాథమిక పాఠశాల ఉందని, 40 మంది పిల్లలు చదువుకుంటున్నారని, ప్రస్తుతం 3, 4, 5 తరగతుల విద్యార్థులను పక్క ఊరు స్కూల్‌కు పంపించాలని ఉపాధ్యాయులు ఒత్తిడి చేస్తున్నారని గ్రామస్తులు డీఆర్వో నరసింహులు దృష్టికి తీసుకెళ్లారు. రేషనలైజేషన్ పేరుతో పాఠశాలను తరలిస్తే తమ పిల్లలకు చదువు దూరమవుతుందని తెలిపారు. అలాగే ఏర్పేడు మండలం పల్లంపేట పాఠశాల విద్యార్థులను 3 కిలోమీటర్ల దూరంలో ఉన్న మరో పాఠశాలకు తరలించాలని అధికారులు పూనుకోవడం సబబు కాదని సీపీఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు, సీఐటీయూ నేత సుబ్రహ్మణ్యం అన్నారు. కలెక్టర్ వెంకటేశ్వర్ చొరవ తీసుకుని పాఠశాలల తరలింపును అడ్డుకోవాలని కోరారు.

కలపాడు భూములు పంచాలి



వెంకటగిరి నియోజకవర్గం కలపాడులో ఉన్న ప్రభుత్వ భూమిని దళిత, గిరిజనులకు పంచాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బాలసుబ్రహ్మణ్యం డిమాండ్ చేశారు. ఈ మేరకు కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేపట్టారు. వారు మాట్లాడుతూ కలపాడు పంచాయతీ పరిధిలో 1,400 ఎకరాలకు పైగా ప్రభుత్వ మేత పోరంబోకు భూములు ఉన్నాయని, వాటిని గ్రామంలోని నిరుపేద కుటుంబాలకు రెండు ఎకరాల చొప్పున పంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో చెంగయ్య, కృష్ణయ్య, లోకేష్, చెంచుకుమార్, సమరం పాల్గొన్నారు.

రేషన్‌కార్డు లేకపోవడంతో ప్రభుత్వ పథకాలు వర్తించలేదు



తమకు రేషన్‌కార్డులు లేకపోవడంతో ప్రభుత్వ పథకాలు వర్తించడంలేదని సత్యవేడు మండలం పేరడం గ్రామం, ఎస్టీకాలనీకి చెందిన వెంకటరత్నం, వీరమ్మ తదితరులు అధికారులకు మొరపెట్టుకున్నారు. కూలీనాలి చేసుకుంటూ జీవనం సాగిస్తున్నామని, ఆస్తులు లేవని, పథకాలు ఇస్తే ఆసరాగా ఉంటుందని వేడుకున్నారు.

జాతీయ రహదారి పేరుతో చెరువులు పూడ్చేస్తున్నారు

జాతీయ రహదారుల విస్తరణ పేరుతో తూకివాకం, దామినేడు, ఓటేరు, పేరూరు చెరువులను పూడ్చివేస్తున్నారని జైహిందుస్థానీ పార్టీ నేత నీలకంఠ అన్నారు. చెరువులు ఉన్న ప్రాంతాల్లో నీటి వనరులను రక్షిస్తూ ఫ్లైఓవర్ నిర్మించాలని డీఆర్వో నరసింహులు దృష్టికి తీసుకెళ్లారు.




చిట్టెమ్మ (ఫైల్), వడమంచి శ్రీను (ఫైల్)

ఆ 9 మంది మృతుల్లో ఐదుగురు శ్రీకాళహస్తివారే

- మామిడి కోతలకు వెళ్లి విగతజీవులుగా మారిన గిరిజనులు
- మృతదేహాల రాకతో విషాదం

రైల్వేకోడూరు/శ్రీకాళహస్తి, జూలై 14 (ఆంధ్రజ్యోతి): వారంతా నిరుపేద గిరిజనులు. మామిడి సీజన్‌లో కాయల కోతలకు వెళుతుంటారు. అలా ఆదివారం అన్నమయ్య జిల్లా రాజంపేటలోని ఇసుకపల్లెలో మామిడి కోతకు వెళ్లారు. పని ముగించుకుని లారీలో కాయలను వేసుకుని వస్తుండగా పుల్లంపేట మండలంలోని రెడ్డిపల్లె చెరువుకట్ట వద్ద ఆదివారం రాత్రి లారీ బోల్తా పడింది. ఈ ఘటనలో 9 మంది మృత్యువాతపడ్డారు. వీరిలో నలుగురు రైల్వేకోడూరు మండలంలోని శెట్టిగుంట.. మిగిలిన ఐదుగురు శ్రీకాళహస్తి మండలం కలవగుంట, గుండ్లపల్లి, చుక్కలనిడిగల్లు ఎస్టీ కాలనీలకు చెందిన వారని తెలిసింది. వీరి మృతదేహాలు సోమవారం ఆయా కాలనీలకు చేరడంతో విషాదం నెలకొంది. శెట్టిగుంటతో పాటు శ్రీకాళహస్తి ప్రాంతంలోని వీరంతా బంధువులే. మృతి చెందిన వారిని గజ్జల గంగమ్మ, చిట్టెమ్మ, రాధమ్మ, జాని, వడమంచి శ్రీను, గజ్జల సుబ్బరత్న, గజ్జల దుర్గయ్య దంపతులుగా గుర్తించారు. వీరిలో వడమంచి శ్రీనుది శ్రీకాళహస్తి మండలం గుండ్లపల్లి.. చిట్టెమ్మది కలవగుంట ఎస్టీకాలనీ. వీరి మృతదేహాలకు సోమవారం బొజ్జల బృందమ్మ నివాళులర్పించారు. మృతుల కుటుంబీకులకు ఆర్థికసాయం చేశారు. మిగతా ముగ్గురి విషయంలో స్పష్టత లేదు. కాగా, రాజంపేట ప్రభుత్వ ఆస్పత్రిలో శవపరీక్షలు పూర్తయి అంబులెన్సుల్లో ఆయా గ్రామాలకు మృతదేహాలను చేర్చారు.

అధిక లోడ్డే కారణం

ప్రమాదానికి గురైంది ఆరు టైర్ల లారీ. ఈ లారీలో సాధారణంగా 6 టన్నులే వేయాలి. దీనికన్నా ఎక్కువగా వేశారు. ముందు వెళుతున్న లారీని ఓవర్‌టేక్ చేసి ఆ తర్వాత ముందు వచ్చే కారును తప్పించాలని చూడటంతో బోల్తాపడిందని స్థానికులు స్థానికులు చెబుతున్నారు.

పవన్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిపై చర్యలు తీసుకోండి

శ్రీకాళహస్తి, జూలై 14(ఆంధ్రజ్యోతి): ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌పై సోషల్ మీడియా వేదికగా అనుచిత వ్యాఖ్యలు చేసిన కొన్ని పార్టీలకు చెందిన వారిపై చర్యలు తీసుకోవాలని శ్రీకాళహస్తి జనసేన నాయకులు కోరారు. సోమవారం రాత్రి వారు శ్రీకాళహస్తి 1వ పట్టణ సీఐ గోపిని కలిసి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా జనసేన ఉమ్మడి జిల్లా కార్యదర్శి కొట్టే సాయి మాట్లాడుతూ శ్రీకాళహస్తి జనసేన పార్టీలో దురదృష్టవశాత్తు జరిగిన ఘటనలపై పవన్‌కల్యాణ్‌ను ఉద్దేశించి అనుచిత వ్యాఖ్యలు చేయడం బాధాకరమన్నారు. ఈ కార్యక్రమంలో కుమార్, మహేష్, గరికపాటి చంద్ర, కవిత, పేట చంద్ర, పేట చిరంజీవి, పగడాల ప్రతాప్, ఈర్ల చిరంజీవి, సురేష్, బద్రి, మోహన్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌పీఎఫ్ మండల అధ్యక్షుడిగా రవిరాయల్



రవి రాయల్‌కు నియామకపత్రం అందజేస్తున్న ప్రతినిధులు

పిచ్చాటూరు, జూలై 14(ఆంధ్రజ్యోతి): రాయల్ పీపుల్ ఫ్రంట్ మండల అధ్యక్షుడిగా సి.ఆర్.రవి రాయల్, ఉపాధ్యక్షులుగా వి.మురళిరాయల్, ఎం.రాజేష్ రాయల్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆర్‌పీఎఫ్ అధ్యక్షుడు టి.రెడ్డిశేఖర్ రాయల్ ప్రక టించారు. పిచ్చాటూరు టీచర్స్ కాలనీలో సోమవారం బలిజ కులస్తులు ఆత్మీయ సమావేశంలో నూతన కమిటీని ఏర్పాటు చేశారు. బలిజ, తెలగ, ఒంటరి, కులస్తుల సమస్యలు పరిష్కారం దిశగా ఆర్‌పీ యాఫ్ పని చేస్తోందన్నారు. ముఖ్య అతి థులుగా బాలకుమార్ రాయల్, గోపి రాయల్, రాఘవరాయల్, ఆనంద్ రాయల్, వేణురాయల్ పాల్గొన్నారు.

రాత్రికి రాత్రే దుకాణం ఏర్పాటు



బంకు అమ్మకం అంటూ పెట్టిన బోర్డు

రేణిగుంట జూలై 14(ఆంధ్రజ్యోతి): పట్టణంలో రాత్రికి రాత్రే అనధికార దుకాణాల ఏర్పాటు పంచాయతీ అధికారుల తీరు విమర్శలకు తావిస్తోంది. జీఎం వీధిలో పోలీస్ స్టేషన్ పక్కన దర్జాగా ఎవరి అనుమతులు లేకుండా పానీపూరి దుకాణం ఆదివారం ఉదయం వెలిసింది. మరోపక్క సీఆర్ఎస్ రైల్వే హాస్పిటల్ ఎదురుగా ఆర్ అండ్ బీ స్థలంలో అనధికార దుకాణం ఏర్పాటుచేశారు. ఇప్పుడు బంకును విక్రయిస్తున్నట్లు పోస్టర్ వెలిసింది. పంచాయతీ అధికారులు నిద్రమత్తు వీడాలని ప్రజలు కోరుతున్నారు.

రుణాల మంజూరు వేగవంతం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీడీ ప్రభావతి

బుచ్చినాయుడుకండ్రిగ, జూలై 14 (ఆంధ్రజ్యోతి): మహిళా సంఘాల బ్యాంకు రుణాలు మంజూరు వేగవంతం చేయాలని వెలుగు ఏపీడీ ప్రభావతి తెలిపారు. మండల కేంద్రంలోని వెలుగు కార్యాలయంలో సీసీలు, ఏపీఎంతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రాజెక్టు మేనేజర్ వనజాక్షి, ఏపీఎం మునెయ్య, సీసీలు వీరజిన్నప్ప, పద్మని, అకౌంటెంట్లు హిమగిరిజ, శిరీష తదితరులు పాల్గొన్నారు.

అన్నదాత సుఖీభవకు ఈకేవైసీ తప్పనిసరి

బుచ్చినాయుడుకండ్రిగ, జూలై 14 (ఆంధ్రజ్యోతి): అన్నదాత సుఖీభవకు ఈకేవైసీ చేసుకుంటేనే ప్రభుత్వ నగదును అందిస్తుందని తహసీల్దార్ శ్రీదేవి తెలిపారు. తహసీల్దార్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో మండల స్థాయి అధికారులతో అన్నదాత సుఖీభవపై చర్చించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటరత్నమ్మ, వ్యవసాయ అధికారి షణ్ముగం తదితరులు పాల్గొన్నారు.

పుత్తూరు వార్తలు

జాతీయ పోటీలకు వడమాలపేట విద్యార్థులు



గ్రాప్లింగ్, రెజ్లింగ్ పోటీల్లో విజయం సాధించిన క్రీడాకారులు

వడమాలపేట,జూలై 14(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర గ్రాప్లింగ్ రెజ్లింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 12 నుంచి 14వ తేదీలలో తిరుపతిలోని గిరిజన భవన్ వేదికగా అండర్ -11, 13, 15 బాల, బాలికలకు గ్రాప్లింగ్ రెజ్లింగ్ పోటీలు నిర్వహించారు. ఇందులో రాష్ట్రం నలుమూలల నుంచి 300 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఈపోటీలలో వివిధ విభాగాలలో పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వడమాలపేట విద్యార్థులు 9 బంగారు, 7 వెండి, 5 కాంస్య పతకాలు సాధించారు. బంగారు పతకాలు సాధించిన వారిలో.. ప్రణతి 7వ తరగతి(30 కిలోలు), శ్రీజన్ 6వ తరగతి(22 కిలోలు), అశ్వత్ 7వ తరగతి (30 కిలోలు), సంతోష్ యాదవ్ 8వ తరగతి(27 కిలోలు), సిద్ధార్థ 10వ తరగతి(42 కిలోలు), గురు దిలీప్ 10వ తరగతి(59 కిలోలు), షణ్ముగం 10వ తరగతి(61 కిలోలు), వినయ్ కుమార్ 10వ తరగతి(69 కిలోలు). వెండి పతకాలు సాధించిన వారిలో.. కార్తీక్ 7వ తరగతి (24 కిలోలు), దేవ హర్ష 8వ తరగతి (30 కిలోలు), తనుష్ 8వ తరగతి (27 కిలోలు), రేవంత్ 7వ తరగతి (27 కిలోలు), యశ్వంత్ 10వ తరగతి (53 కిలోలు). బంగారు, వెండి పతకాలు పతకాలు సాధించిన క్రీడాకారులందరూ ఈనెల 26 నుంచి 29వ తేదీ వరకు ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రం బిలాస్ పూర్‌లో జరిగే జాతీయస్థాయి పోటీలకు అర్హత సాధించారు.

వైభవంగా సంకటహర చతుర్థి పూజలు



వడమాలపేటలో ప్రత్యేక అలంకరణలో కళ్యాణ గణపతి

వడమాలపేట,జూలై 14 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కళ్యాణగణపతి ఆలయంలో సంకటహర చతుర్థి సందర్భంగా సోమవారం అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వ హించారు. సాయంత్రం వినాయకునికి అర్చన, గరికలతో సింధూర జలాభిషేకం, విభూదితో భస్మాభిషేకం నిర్వహించారు. స్వామివారిని పూల మాలలతో విశేషంగా అలంక రించారు. శని ప్రభావం ఉన్న వారిచే అర్చనలు చేయించి అర్చకులు శివ, సాయిలు వేదమంత్రాలతో ప్రత్యేక పూజలు జరిపించారు.

రెండు రోజులపాటు తాగునీటి సరఫరాకు అంతరాయం

నాయుడుపేట, జూలై 14 (ఆంధ్రజ్యోతి): విన్నమాల పంటకాలువ పూడికతీత పనుల సందర్భంగా తాగునీటి పైపులు దెబ్బతిన్నాని, దీని వల్ల పట్టణంలో రెండు రోజుల పాటు తాగునీటి సరఫరా ఉండదని మున్సిపల్ కమిషనర్ ఫజులుల్లా తెలిపారు. పొగగొట్టంకాలనీ కాలువ గట్టుకాలనీ, శంకరాపురం, జైహింద్‌కాలనీ, బాలాజీ గార్డెన్, బ్రాహ్మణ వీధి, రజకకాలనీ, గెరిడీవీధి, రాజగోపాలపురం, బజారువీధి ప్రాంతాల్లో పైపు లైన్లు మరమ్మతులకు గురైనట్లు కమిషనర్ పేర్కొన్నారు. ఆయా ప్రాంతాల ప్రజలు ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని, అత్యవసరమైతే ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేస్తామని, ఇందుకోసం వి.నాగరాజు 9849742056, ఎం.శ్రీనివాసులు 9666612492, వీరాస్వామి 9491285256 నెంబర్లకు సంప్రదించవచ్చన్నారు.

అడుగడుగునా గోతులే

- అధ్వానంగా కోటపోలూరు రోడ్డు
- వాహనదారులకు నరకం

సూళ్లూరుపేట, జూలై 14 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట నుంచి కోట - వాకాడుకు వెళ్లే రహదారి కోటపోలూరు నుంచి అధ్వానంగా ఉంది. కోటపోలూరు రైల్వేగేటు నుంచి హరిజనవాడ వరకు దాదాపు 5 కిలోమీటర్ల మేర రోడ్డుపై పెద్దపెద్ద గోతులు ఏర్పడి వాహనాలు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. దారి పొడవునా గుంతలు ఉండడంతో ద్విచక్ర వాహన దారులకు కూడా ఇబ్బందులు తప్పడం లేదు. రోడ్డు సైడ్ బర్మర్లు కూడా వర్షపునీటికి కోతకు గురవ్వడంతో ఎదురెదురు వాహనాలు వచ్చినప్పుడు సాహసం చేయాల్సిన పరిస్థితి వస్తోందని వాహనదారులు భయాందోళన చెందుతున్నారు. గత వైసీపీ పాలనలో ఈరోడ్డు గురించి పట్టించుకున్న పాపానపోలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్త యిన మరమ్మతులు చేపట్టలేదు. ఇటీవల కురిసిన తేలికపాటి జల్లులకు రోడ్డుపై వర్షపు నీరు నిలబడడంతో మరింత దారుణంగా తయారైంది. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి కోటపోలూరు, కోట - వాకాడు రోడ్డుకు మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.



అధ్వానంగా ఉన్న కోటపోలూరు రోడ్డు

సీఎం చంద్రబాబుతోనే సుపరిపాలన: పాశిం

చిట్టమూరు, జూలై 14(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతోనే సుపరిపాలన సాధ్యమని గూడూరు ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ అన్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు గణపర్తి కిషోర్ నాయుడు ఆధ్వర్యంలో సోమవారం సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఉప్పలమర్తి, మెట్టు గ్రామాల్లో ఎమ్మెల్యే పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందజేస్తున్న పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఉప్పలమర్తి, మెట్టు గ్రామాల్లో రూ.10లక్షలతో నిర్మించిన సిమెంట్ రోడ్లను ప్రారంభించారు. గ్రామాల్లో మొక్కలు నాటారు. మెట్టులో సామూహిక సీమంతం కార్యక్రమంలో పాల్గొని వారికి అన్న ప్రాసన, సారె అందించి ఆశీర్వదించారు. ఉప్పలమర్తిలో ఎమ్మెల్యే మాట్లాడుతూ... కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత సీఎం చంద్రబాబు నాయుడు సుపరిపాలనతో రాష్ట్రాన్ని అభివృద్ధి వైపు పరుగులు పెట్టిస్తున్నారని అన్నారు. అభివృద్ధితో హామీలను అమలు పరుస్తూ సంక్షేమం అందిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీవో మనోహర్ గౌడ్, తహసీల్దారు సతీష్ కుమార్, గూడూరు నియోజకవర్గ పరిశీలికుడు ఈశ్వరవాక శివకోటరెడ్డి, టీడీపీ నాయకులు మారంరెడ్డి జనార్దనరెడ్డి, దువ్వూరు భారతమ్మ, కస్తూరయ్య, గుంపర్ల చిన్నారావు, కావులూరు చెంచురామయ్య తదితరులు పాల్గొన్నారు.



ఉప్పలమర్తిలో మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే సునీల్ కుమార్

అర్హులందరికీ సంక్షేమ పథకాలు: విజయశ్రీ



కోటపోలూరులో కరపత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే విజయశ్రీ, టీడీపీ నాయకులు శంకరయ్య, సుధాకర్ రెడ్డి, వెంకటసుబ్బయ్య

సూళ్లూరుపేట, జూలై 14 (ఆంధ్రజ్యోతి): అర్హులందరికీ ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందిస్తోందని ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ అన్నారు. మండలంలోని కోటపోలూరు, సామంతమల్లాం, ఆబాక గ్రామాల్లో సోమవారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా విజయశ్రీ ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. సీఎం చంద్రబాబు నాయుడు రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపేందుకు శాయశక్తులా కృషి చేస్తున్నారని తెలిపారు. ఆర్థిక పరిస్థితులు క్లిష్టతరంగా ఉన్నప్పటికీ ప్రజల అభ్యున్నతి, సంక్షేమమే అజెండాగా పాలన సాగుతోందన్నారు. గ్రామాల్లో ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు సమన్వయంగా పనిచేస్తూ సమస్యలు పరిష్కరించడంలో ప్రత్యేకంగా చొరవ తీసుకుంటున్నామన్నారు. ఈ సందర్భంగా కోటపోలూరు ప్రాథమిక పాఠశాలకు వెళ్లి అక్కడ విద్యార్థులతో కాసేపు ముచ్చటించారు. అదే విధంగా ఆబాక అంగన్వాడీ కేంద్రంలో చిన్నారులతో ముచ్చటించి వారికి పౌష్టికాహారం సక్రమంగా అందిస్తున్నారా లేదా అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రూరల్ అధ్యక్ష, కార్యదర్శులు కొక్కు శంకరయ్య, పాకం వెంకటసుబ్బయ్య, టీడీపీ నాయకులు సుధాకర్ రెడ్డి, కరకంబేటి సుబ్రహ్మణ్యం, జనార్దన్, ఏలిబేటి సతీష్, పర్వతరెడ్డి చంద్రారెడ్డి, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే కూటమి ధ్యేయం: కురుగొండ్ల

బాలాయపల్లి, జూలై 14(ఆంధ్రజ్యోతి) అభివృద్ధి, సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. సోమవారం మండలంలోని పెరిమిడి పంచాయతీ మేల్బూరు గ్రామంలో సుపరిపాలనలో తొలి అగుడు కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ఏడాది పాలనలో చేపట్టిన అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలను వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. రూ.4 లక్షలతో నిర్మించిన సిమెంటు రోడ్డును ప్రారంభించారు. నోషనల్ ఖాతాతో అన్నదాత సుఖీభవ పథకానికి దూరమవుతున్నారని కొందరు రైతులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు. జాయింట్ కలెక్టర్‌తో మాట్లాడి నోషనల్ ఖాతాలను రెగ్యులర్ చేసేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. తాగునీటి సమస్యతో అవస్థలు పడుతున్నామని మేల్బూరు గిరిజన కాలనీవాసులు చెప్పడంతో వెంటనే సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే చెప్పారు. కార్యక్రమంలో సర్పంచు వనమ్మ, టీడీపీ మండల అధ్యక్షుడు రాయి మస్తాన్ నాయుడు, నియోజకవర్గ పరిశీలకుడు జన్ని రమణయ్య, ఏఎంసీ మాజీ ఛైర్మన్ సింగంశెట్టి భాస్కరరావు, దాసరి రాజగోపాల్‌నాయుడు, దాసరి ప్రభాకర్ నాయుడు, రాయి సత్యం నాయుడు, కూను శ్రీహరి, తాళ్లూరు ప్రసాద్ నాయుడు, నక్కబోతుల మురళి, చిత్తూరు ఈశ్వరయ్య, మల్లెమాల గోపీకృష్ణారెడ్డి, దాసరి కోటేశ్వరావు, వేళ్ల సురేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మేల్బూరులో సిమెంటు రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కురుగొండ్ల

పోక్సో కేసు నమోదు

వెంకటగిరి టౌన్, జూలై 14(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ముద్దకృష్ణ అనే వ్యక్తిపై పోక్సో నమోదు చేశామని ఎస్ఐ ఏడుకొండలు సోమవారం తెలిపారు. 17 ఏళ్ల బాలికను ప్రేమ పేరుతో మోసం చేయడంతో బాధిత బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోక్సో నమోదు చేశామని ఎస్ఐ చెప్పారు.

శ్మశానం దారి కబ్జా

వెంకటగిరి టౌన్, జూలై 14(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని బునపాళెం గిరిజనుల శ్మశానం దారి కబ్జా చేశారని గ్రామస్థులు సోమవారం సీనియర్ అసిస్టెంట్‌కు నాగమల్లీశ్వరికి సోమవారం వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి నందయ్య, సిద్ధరామయ్య, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

సాగరమాల రోడ్డు పనుల పరిశీలన

కోట, జూలై 14 (ఆంధ్రజ్యోతి): కోట మండలంలోని సాగరమాల రోడ్డు పనులను నేషనల్ హైవే అథారిటీ ఢిల్లీ అధికారులు పరిశీలించారు. చెందోడు, నెల్లూరుపల్లి కొత్తపాళెం, కర్లపూడి, కనుపూరు ప్రాంతాల్లో జరుగుతున్న రోడ్డు, కల్వర్టులు, అండర్ బ్రిడ్జిలను నాణ్యతను పరిశీలించారు. కార్యక్రమంలో నేషనల్ హైవే అథారిటీ జనరల్ మేనేజర్ పహిరాం, డీజీఎం రాజ్‌కుమార్ నగ్రవాల్, సాగరమాల పీఆర్‌వో దిలీప్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

వెలుగు ఏపీఎంగా పోలమ్మ

వాకాడు, జూలై 14 (ఆంధ్రజ్యోతి): వాకాడు వెలుగు ఏపీఎంగా పోలమ్మ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. బాలయపల్లి మండలంలో ఏపీఎంగా విధులు నిర్వహిస్తున్న పోలమ్మ బదిలీపై వాకాడుకు వచ్చారు.

హెల్పర్లకు సామగ్రి అందజేత

కోట, జూలై 14 (ఆంధ్రజ్యోతి): కోటలోని ఐసీడీఎస్ పరిధిలోని కోట, వాకాడు, చిట్టమూరు మండలాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల హెల్పర్లకు సోమవారం సీడీపీవో మునికుమార్ ఆధ్వర్యంలో హెల్పర్లకు సామగ్రిని పంపిణీ చేశారు.

పీజీఆర్ఎస్ అర్జీలపై ప్రత్యేక దృష్టి

డక్కిలి, జూలై 14 (ఆంధ్రజ్యోతి) ప్రజా విజ్ఞప్తుల దినంలో అందిన అర్జీలపై ప్రత్యేక దృష్టి పెట్టి వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నట్లు తహసీల్దార్ శ్రీనివాసులు తెలిపారు. సోమవారం నిర్వహించిన ప్రజా విజ్ఞప్తుల దినంలో సుమారు 50 అర్జీలు వరకు వచ్చాయని, వీటిలో చాలా వరకు అక్కడికక్కడే పరిష్కరించడం జరిగిందన్నారు. ఎక్కువగా భూ సమస్యలపై అర్జీలు అందినట్లు తెలిపారు.

భూములకు ఆధార్ అనుసంధానం చేసుకోండి

చిట్టమూరు, జూలై 14(ఆంధ్రజ్యోతి): భూములకు ఆధార్ అనుసంధానం చేసుకోవాలని తహసీల్దారు సతీష్ కుమార్ సూచించారు. అన్నదాత సుఖీభవ పథకం జాబితాలో పేర్లు లేకపోవడానికి భూమికి ఆధార్ నెంబర్ అనుసంధానం కాకపోవడం కారణమన్నారు.

నేటి నుంచి గ్రామసభలు

నాయుడుపేట టౌన్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని పంచాయతీల్లో ఈనెల 15నుంచి 25వ తేదీ వరకు గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో సురేష్‌బాబు తెలిపారు. పీ-4 సర్వే ధ్రువీకరణలో భాగంగా బంగారు కుటుంబాల తుది జాబితా రూపొందించేందుకు గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో తెలిపారు. **ఓజిలి:** మండలంలో మంగళవారం నుంచి ఈనెల 25వ తేదీ వరకు పీ-4 సర్వే పునఃధ్రువీకరణ గ్రామసభలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో విజయలక్ష్మి తెలిపారు.

కారు దగ్ధం

చిల్లకూరు, జూలై 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బూదనం గ్రామ సమీపంలోని డెయిరీ వద్ద సోమవారం ఓ కారులో దగ్ధమైంది. స్థానికుల వివరాల మేరకు... తిరుపతి నుంచి ఒంగోలుకు కారులో వెళుతున్నవారు బూదనం గ్రామ సమీపంలోని పాలడెయిరీ వద్ద ఆగి కూల్‌డ్రింక్స్ తాగేందుకు దుకాణంలోకి వెళ్లారు. అదే సమయంలో కారులో మంటలు చెలరేగి పూర్తిగా కాలిపోయింది.

క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు

దొరవారిసత్రం, జూలై 14(ఆంధ్రజ్యోతి): తిరుపతి స్విమ్స్ ఆస్పత్రి ఆధ్వర్యంలో సోమవారం దొరవారిసత్రం, తొగరాముడి పీహెచ్‌సీల్లో క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. స్త్రీలకు నోటి, గర్భాశయ ముఖద్వార, రొమ్ము క్యాన్సర్ పరీక్షలు నిర్వహించారు. డాక్టర్ కె.నాగరాజు పర్యవేక్షణలో వైద్యులు తరుణ్‌సాయికుమార్, చైతన్య, నవీన, చైతన్యబాను, హిరత పరీక్షలు నిర్వహించారు. అలాగే 15వ తేదీన గొట్టిప్రోలు, పేర్నాడు, 17వ తడ, రామాపురం, 18వ తేదీన మల్లాం, ఈశ్వారవాక పీహెచ్‌సీల్లో క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తామని డాక్టర్ నాగరాజు తెలిపారు.

ముక్కంటికి వెండి నాగపడగల వితరణ



శ్రీకాళహస్తి, జూలై 14(ఆంధ్రజ్యోతి): జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వర స్వామికి విజయనగరం జిల్లా బొబ్బిలికి చెందిన లక్ష్మి దంపతులు 3.18కేజీల వెండి నాగపడగలను వితరణ చేశారు. వీటిని ఈవో బాపిరెడ్డి స్వీకరించి దాతలకు స్వామి అమ్మవార్ల దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం వేదపండితులు వారిని ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు.

నాలుగు దుకాణాల్లో చోరీ

గూడూరు, అర్బన్, జూలై 14(ఆంధ్రజ్యోతి): స్థానిక టవర్‌క్లాక్ సమీపంలోని ద్రౌపది కాంప్లెక్స్‌లోని నాలుగు దుకాణాల్లో సోమవారం చోరీ జరిగింది. స్థానికుల వివరాల మేరకు.. ద్రౌపది కాంప్లెక్స్‌లోని నాలుగు దుకాణాలపై ఉన్న రేకులను గుర్తుతెలియని వ్యక్తులు తొలగించి లోపలికి ప్రవేశించారు. ఓ సెల్‌ఫోన్ రిపేర్ షాపులో మరమ్మతులకు గురైన నాలుగు సెల్‌ఫోన్లు, రూ.2వేల నగదు, పక్కనే ఉన్న చిల్లర దుకాణంలో రూ.4వేల నగదు ఎత్తుకెళ్లారు. మరో రెండు దుకాణాల్లో చోరీకి యత్నించినా అందులో నగదు లేకపోవడంతో వెళ్లిపోయారు. ఆయా దుకాణదారులు పోలీసులకు సమాచారం అందించారు.

వరుస చోరీలతో ప్రజల భయాందోళన

పట్టణంలో ఇటీవల వరుసగా చోరీలు జరుగుతుండడంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. నిత్యం రద్దీగా ఉండే టవర్‌క్లాక్ సెంటర్ సమీపంలోని దుకాణాల పైన రేకులు తొలగించి చోరీకి పాల్పడడం, ఇటీవల గముళ్లపాళెంలోని ఓ ఇంట్లో 30 సవర్ల బంగారాన్ని అపహరించుకువెళ్లడం, అశోక్‌నగర్ ప్రాంతంలో ఓ ఇంట్లో చోరీకి యత్నించడం వంటి సంఘటనలతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. పోలీసులు గస్తీ పెంచి చోరీలను నియంత్రణకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

పాఠశాలలను యథావిధిగా కొనసాగించాలి



నిరసన కార్యక్రమంలో చింతా మోహన్, పక్కన కాంగ్రెస్ నాయకులు

సూళ్లూరుపేట, జూలై 14 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో ప్రాథమిక పాఠశాలలను యథావిధిగా కొనసాగించాలని మాజీ కేంద్ర మంత్రి చింతా మోహన్ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక ఆర్టీసీ బస్టాండు సెంటర్ వద్ద కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జరిగిన నిరసన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పేద పిల్లలను దృష్టిలో పెట్టుకుని దళితవాడ, గిరిజన సెంటర్లతో పాటు అవసరమైన చోట ప్రాథమిక పాఠశాలలను ఏర్పాటు చేశారన్నారు. కూటమి ప్రభుత్వం చాలాచోట్ల ప్రాథమిక పాఠశాలలను రద్దు చేయడం అన్యాయమన్నారు. వెంటనే దీనిని ప్రభుత్వ ఉపసంహరించుకోకపోతే ఉద్యమాలు చేస్తామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు చందనమూడి శివ, ఈశ్వరయ్య, వెంకటకృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కాంట్రాక్ట్ పనుల్లో 25 శాతం బహుజనులకు అప్పగించాలి

నాయుడుపేట, జూలై 14 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ కాంట్రాక్టులు, గనుల మైనింగ్ అనుమతుల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓబీసీ, బహుజనులకు 25 శాతం అప్పగించాలని కేంద్ర మాజీ మంత్రి డాక్టర్ చింతామోహన్ అన్నారు. సోమవారం నాయుడుపేట అంబేడ్కర్ భవన్ వద్ద ఆయన మీడియాతో మాట్లాడారు. కర్ణాటకలోని కాంగ్రెస్ ప్రభుత్వ తరహాలో ఆంధ్రప్రదేశ్‌లో కూడా బహుజనులకు ప్రభుత్వ కాంట్రాక్ట్ పనుల్లో 25శాతం భాగస్వామ్యం చేయడం ద్వారా ఆయా సామాజిక వర్గాలు కూడా ఆర్థికంగా బలపడుతాయన్నారు. సైదాపురంలోని క్వార్ట్జ్, చిల్లకూరులోని సిలికా, నాయుడుపేట, సూళ్లూరుపేటలోని ఇసుక తదితర వాటిల్లో కూడా బహుజనులకు వాటా ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గాలి వెంకటయ్య, నాగూరయ్య చిరంజీవి, శివ, శంకర్‌రాజు, శంకరయ్య, నాగయ్య తదితరులు ఉన్నారు.

పేదలు సాగు చేస్తున్న భూములకు పట్టాలు ఇవ్వండి

గూడూరు, జూలై 14 (ఆంధ్రజ్యోతి): పేదలు సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలు అందజేయాలని విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు ఏనుపాక పెంచలయ్య అన్నారు. సోమవారం స్థానిక తహసీల్దారు కార్యాలయంలో మిటాత్మకూరు గ్రామస్థులతో కలిసి ఇన్‌చార్జి తహసీల్దారు ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని మిటాత్మకూరు గ్రామంలో 20 మంది ఎస్సీ, ఎస్టీలు కొన్నేళ్లుగా భూములను సాగు చేసుకుని జీవనం సాగిస్తున్నారన్నారు. వీరికి పట్టాలు అందజేయాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు వెంకటేశ్వర్లురాజు, శ్రీహరి, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా గ్రావెల్ తరలింపు

ఓజిలి, జూలై 14 (ఆంధ్రజ్యోతి): ఓజిలి మండలం ముమ్మాయపాళెంలో సోమవారం అక్రమంగా గ్రావెల్ తరలింపు కొనసాగింది. గ్రామానికి సమీపంలోని సంపద తయారీ కేంద్రం వద్ద ప్రభుత్వ భూముల్లో ఎక్స్‌కవేటర్ల సాయంతో గ్రావెల్ తవ్వి ట్రాక్టర్ల ద్వారా తరలించారు. ఇళ్లు, ఇతర అవసరాల పేరుతో కర్మాగారాలకు గ్రావెల్ తరలిస్తున్నట్లు గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. గ్రామస్థుల ఫిర్యాదుతో తహసీల్దారు పద్మావతి స్పందించి వీఆర్వోను పంపించి గ్రావెల్ తరలింపును అడ్డుకున్నారు.

ముక్కంటి ఆలయంలో భక్తుల రద్దీ



దర్శనం కోసం వేచి ఉన్న భక్తులు

శ్రీకాళహస్తి, జూలై 14(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో సోమవారం భక్తుల రద్దీ నెలకొంది. సోమవారం స్వామివారికి ప్రీతికరమైన రోజు కావడంతో రెండు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా పొరుగు రాష్ట్రాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలి వచ్చారు. సుమారు 28వేలమంది భక్తులు దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. రూ.500 అంతరాలయ దర్శనం 537, రూ.200 శీఘ్ర దర్శనం టిక్కెట్ల ద్వారా 3,066మంది, రూ.50ప్రత్యేక దర్శనం టిక్కెట్ల ద్వారా 2,554మంది భక్తులు దర్శించుకున్నారు. ఇక రూ.500 రాహుకేతు టిక్కెట్ల ద్వారా 2,930మంది, రూ.750 టిక్కెట్ల ద్వారా 1,292, రూ.1,500 టిక్కెట్ల ద్వారా 354మంది, రూ.2,500 టిక్కెట్ల ద్వారా 241మంది, రూ.5వేలు టిక్కెట్ల ద్వారా 67మంది భక్తులు పూజలు చేయించుకున్నారు. ఇక ఐదు రకాల ప్రసాదాలు కలిపి 25,492 అమ్ముడైనట్లు ఆలయ అధికారులు వివరించారు.

శ్రీకాళహస్తి

సత్యవేడు

ఆగమోక్తంగా మృత్యుంజయ పూజలు

శ్రీకాళహస్తి, జూలై 14(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాల యంలో కొలువైన మృత్యుంజయస్వామికి సోమవారం ఆగ మోక్తంగా పూజలు నిర్వహించారు. ముందుగా వినాయక స్వామికి పలు రకాల సుగంధ ద్రవ్యాలతో అభిషేకం చేశారు. అనంతరం వివిధ పుష్పాలతో, గజమాల, వెండి నాగాభరణంతో స్వామివారిని శోభాయమానంగా అలంకరించారు. ధూప, దీప నైవేద్యాలు, మహామంగళ హారతులు సమర్పించారు. భక్తులు పెద్దసంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు.

శాస్త్రోక్తంగా సంకట చతుర్దశి పూజలు



శ్రీకాళహస్తి, జూన్ 14(ఆంధ్ర జ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయం లోని అంజ అంజి వినాయకస్వామి ఆలయం వద్ద సంకట చతుర్థశిని పురస్కరించుకుని శాస్త్రోక్తంగా పూజలు నిర్వ హించారు. కలశ స్థాపన పూజలు చేశారు. అభిషేకం నిర్వహించి స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు పెద్దసంఖ్యలో ఈ పూజల్లో పాల్గొన్నారు.

రాయుడు మృతిపై జ్యుడీషియల్ విచారణ చేపట్టండి



ఆర్డీవోకు వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

శ్రీకాళహస్తి, జూలై 14(ఆంధ్ర జ్యోతి): శ్రీకాళహస్తి జనసేన నియోజకవర్గ మాజీ ఇన్‌ఛార్జి కోట వినుత కారు డ్రైవర్ శ్రీనివాసులు అలియాస్ రాయుడు మృతిపై జ్యుడీషియల్ విచారణ చేపట్టాలని సీపీఐ నాయకులు కోరారు. సోమవారం ఆర్డీవో భానుప్రకాష్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఐ ఏరియా కార్యదర్శి జనమాల గురవయ్య మాట్లాడుతూ 2019 నుంచి ఎంతో నమ్మకంగా ఉన్న రాయుడును జనసేన నేతలు ఎందుకు హత్యచేశారో నియోజకవర్గ ప్రజలకు తెలియాల్సిన అవసరం ఉందన్నారు. రాయుడు హత్యకు వ్యక్తిగత కారణాలా లేక రాజకీయ కారణాలా అని విచారణ అధికారులు తెలియజేయాలన్నారు.

21న చలో విజయవాడ

శ్రీకాళహస్తి, జూలై 14(ఆంధ్రజ్యోతి): చలో విజయవాడ ఈ నెల 21న నిర్వహించనున్నట్లు ఎనర్జీ ఎంప్లాయిస్ అసోసియేషన్ నాయకులు తెలిపారు. సోమవారం వారు శ్రీకాళహస్తి సబ్ డివిజన్ ఏడీఈని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏపీఎస్ఈబీ పాత సర్వీస్ రూల్స్ వర్తింపజేసి అందరికీ ప్రమోషన్లు కల్పించాలన్నారు. 21న చలో విజయవాడలో భాగంగా రామవరప్పాడు రింగు రోడ్డునుంచి విద్యుత్ సౌధ వరకు ర్యాలీ నిర్వహిస్తామన్నారు. అసోసియేషన్ రాష్ట్ర కమిటీ సభ్యులు ముని, హరికృష్ణ, అశోక్, శ్రీనాథ్ పాల్గొన్నారు.

సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం



కరపత్రాలు అందజేస్తున్న టీడీపీ నాయకులు

శ్రీకాళహస్తి, జూలై 14(ఆంధ్రజ్యోతి): సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని టీడీపీ శ్రీకాళహస్తి మండలాధ్యక్షుడు అక్కింతల కృష్ణయాదవ్ అన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా సోమవారం శ్రీకాళహస్తి మండలం ఈండ్రపల్లి, వాగివేడు, యల్లంపల్లి, పాపన్నపల్లి, బ్రాహ్మణపల్లి గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు రంగినేని చెంచయ్యనాయుడు, చెలికం పాపిరెడ్డి, కామేష్ యాదవ్, రమేష్, రవీంద్రనాథ్‌రెడ్డి, కృష్ణమనాయుడు, దొరైరాజ్‌రెడ్డి, ఈశ్వరరెడ్డి పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే 'తొలి అడుగు'



అమందూరులో తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొన్న టీడీపీ నాయకులు

ఏర్పేడు, జూలై 14(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో నెలకొన్న దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించడానికి సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమన్ని నిర్వహిస్తున్నట్లు టీడీపీ సీనియర్ నేత పొన్నారావు అన్నారు. ఏర్పేడు మండలం ఆమందూరు పంచాయతీలో సోమవారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యమం నిర్వహించారు. ప్రతి ఇంటికి కరపత్రాల ద్వారా ప్రభుత్వం అంది స్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ఈకార్యక్రమంలో టీడీపీ నాయకులు ధనంజయుల నాయుడు, నాగరాజునాయుడు, గురవారెడ్డి, మోహన్‌రావు, సూరినాయుడు, శివశంకర్‌రెడ్డి, గుణ యాదవ్, రాచేటి సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్ బాధితురాలికి భరోసా



క్యాన్సర్ బాధితురాలితో మాట్లాడుతున్న శంకర్‌రెడ్డి

వరదయ్యపాళెం, జూలై 14 (ఆంధ్రజ్యోతి): వరదయ్య పాళెం మండలం సీఎల్ఎన్‌పల్లిలో క్యాన్సర్‌తో బాధ పడుతున్న గౌస్‌బాషా భార్య అములును టీడీపీ ప్రోగ్రామ్ కో-ఆర్డినేటర్ కూరపాటి శంకర్‌రెడ్డి పరామర్శించారు. పేదరికం కారణంగా క్యాన్సర్‌కు చికిత్స చేయించుకోలేకున్నామని వారు ఆయన ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. స్పందించిన ఆయన సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఆర్థికసాయం అందించేందుకు కృషిచేస్తామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ అధ్యక్షుడు యుగంధర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ రవిరెడ్డి, నాయకులు మునిభూషణమ్మ తదితరులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు ఆర్థికసాయం



శ్రీకాళహస్తి, జూలై 14(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి మండలం గుండ్లపల్లి ఎస్టీకాలనీకి చెందిన శ్రీను, కలవగుంట ఎస్టీకాలనీకి చెందిన చిట్టెమ్మ సోమవారం మరణించారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి తల్లి బృందమ్మ అక్కడికి చేరుకుని మృతదేహాలకు పూలమాలల వేసి నివాళులు అర్పించారు. వారి కుటుంబాలను ఓదార్చి రూ.10వేలు చొప్పున ఆర్థికసాయం చేశారు.

అర్హులకు పట్టాలిస్తాం



వినతులు స్వీకరిస్తున్న రెడ్డివారి గురవారెడ్డి, రెవెన్యూ అధికారులు

ఏర్పేడు, జూలై 14(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో నిరుపేదలకు ప్రభుత్వం త్వరలో ఇంటి పట్టాలు ఇవ్వనుందని రెవెన్యూ అధికారులు స్పష్టంచేశారు. మండలంలోని అన్ని రెవెన్యూ గ్రామాల్లో తహసీల్దారు భార్గవి ఆదేశాల మేరకు గ్రామసభలు నిర్వహించారు. బండారుపల్లిలో జరిగిన కార్యక్రమానికి టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రెడ్డివారి గురవారెడ్డి, మద్దు సుబ్రహ్మణ్యం హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ సుబ్రహ్మణ్యం, వీఆర్వో మణి, వీఎస్ నాగరాజు, వీఆర్ఏ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

కుంభాభిషేకంలో ఎమ్మెల్యే ఆదిమూలం

నాగలాపురం, జూలై 14(ఆంధ్రజ్యోతి): నాగలాపురం మండలం సురుటుపల్లి గ్రామ పంచాయతీ కస్తూరి నాయుడు కండ్రిగ గ్రామంలో వినాయక స్వామి ఆలయ మహా కుంభాభిషేకం సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం విచ్చేశారు. అర్చకులు రుద్రమూర్తి, బాలచంద్రుడు స్వామి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే , గ్రామస్తులు కలశాలతో ఆలయ ప్రదక్షిణ చేసి స్వామికి నైవేద్యాలు సమర్పించారు. టీడీపీ నాయకులు మురళీనాయుడు, మనోజ్‌నాయుడు, ఇళంగోవన్‌రెడ్డి, మురళి, ఎస్ఎం సురేష్, సర్పంచ్ కాంతమ్మ, సుబ్రహ్మణ్యం, ధనశేఖర్, దిలీప్ పాల్గొన్నారు.

రెండు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

సత్యవేడు, జూలై 14 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్లను పోలీసులు పట్టుకున్నారు. మండల పరిధిలోని వీఆర్ కండ్రిగ వద్ద సోమవారం ఉదయం ఎస్ఐ రామస్వామి సిబ్బందితో కలిసి వాహన తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో వచ్చిన రెండు ఇసుక ట్రాక్టర్లను ఆపి రికార్డులు తనిఖీ చేశారు. ఇసుక తరలింపునకు సంబంధించి ఎలాంటి రికార్డులు లేకపోవడంతో ఇద్దరు డ్రైవర్లను అదుపులో తీసుకున్నారు. ట్రాక్టర్లను స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేశారు.

ఇంటి పట్టాలివ్వాలని ధర్నా

సత్యవేడు, జూలై 14 (ఆంధ్రజ్యోతి): ఇంటి పట్టాలివ్వాలని మండలంలోని కొత్తమారికుప్పం గిరిజన కాలనీకి చెందిన గిరిజనులు సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి అంబాకం చిన్నిరాజ్ ఆధ్వర్యంలో మండల పర్యటనకు వచ్చిన ఎమ్మెల్యే ఆదిమూలంను కలిసి విన్నవించారు. దీనిపై పరిశీలించి అర్హులకు న్యాయం చేయాలని తహసీల్దార్ రాజశేఖర్‌ను ఎమ్మెల్యే ఆదేశించారు.

పొజిషన్ సర్టిఫికెట్ల పంపిణీ



బుచ్చినాయుడుకండ్రిగ, జూలై 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆలత్తూరు పంచాయలోని 20 మంది గిరిజనులకు పొజిషన్ సర్టిఫికేట్స్‌ను తహసీల్దార్ శ్రీదేవి తన కార్యాలయంలో సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇంటి స్థలాలు ఉండి హౌసింగ్ కోసం, పొజిషన్ సర్టిఫికేట్స్ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకుంటే మంజూరు చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో బాస్కర్ గిరిజనులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు



ప్రజలకు కరపత్రాలు అందజేస్తున్న విజయకుమార్ తదితరులు

శ్రీకాళహస్తి, జూలై 14(ఆంధ్రజ్యోతి): అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ సంక్షేమఫలాలు అందుతాయని టీడీపీ పట్టణాధ్యక్షుడు విజయకుమార్ అన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్య క్రమంలో భాగంగా సోమవారం 28వ వార్డు పరిధిలోని బృందమ్మకాలనీలో పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ కరపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 204 అన్నా క్యాంటీన్ల ద్వారా రూ.5కే నాణ్యమైన భోజనం అందిస్తున్నామన్నారు. రైతుకు 9గంటలు ఉచిత విద్యుత్, చేనేతల పవర్ లూమ్స్‌కు 500 యూనిట్లు, హ్యాండ్ లూమ్స్‌కు 200 యూనిట్లు ఉచిత విద్యుత్, దీపం పథకం కింద అర్హులైన ప్రతి ఒక్కరికీ ఏడాదికి మూడు ఉచిత సిలిండర్లు అందజేస్తున్నట్లు తెలిపారు. పింఛన్ల పెంపు, మెగా డీఎస్సీ, ఆగస్టు 15నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కంఠా రమేష్, రమేష్‌బాబు, గుత్తా విజయనాయుడు, చెంచయ్య, నాయకులు, పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

కరాటే చిచ్చరపిడుగు రిత్విక్‌కు గిన్నిస్ ప్రశంసాపత్రం



ప్రశంసా పత్రం అందుకుంటున్న రిత్విక్ యాదవ్

సత్యవేడు, జూలై 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఆరవ తరగతి చదువుతున్న విద్యార్థి రిత్విక్ యాదవ్ కరాటే ప్రదర్శనలో గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ సంస్థ నుంచి ప్రశంసా పత్రం అందుకున్నాడు. ఈ ఏడాది ఫిబ్రవరిలో తమిళనాడు ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ యూనివర్శిటీ చెన్నైలో జరిగిన గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ టైటిల్ అటెంప్ట్ లార్జెస్ట్ కరాటే లెసన్ (సింగిల్ వెన్యూ)లో సత్యవేడు కరాటే అకాడమీ నుంచి 20 మంది విద్యార్థులు పాల్గొన్నారు. పోటీలలో పాల్గొన్నందుకు సదరు సంస్థ నుంచి రిత్విక్ ప్రశంసా పత్రం అందుకున్నాడు. బాలికల ఉన్నత పాఠశాల ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమంలో కరాటే మాస్టర్స్ కోషి విల్సన్, భువనేష్, బీజేపీ మండల అధ్యక్షుడు బాలాజీ చేతుల మీదుగా రిత్విక్ ఈ ప్రశంసా పత్రాన్ని అందుకున్నాడు. కరాటే శిక్షకులు గోపి, సతీష్, తిరుపతి, సూర్య జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

పెయిడ్ ఆర్టిస్టులపై చర్యలు తీసుకోండి: టీడీపీ



సీఐ శ్రీకాంత్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఏర్పేడు, జూలై 14(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి నియోజకవర్గం జనసేన మాజీ ఇన్‌ఛార్జి కోట వినుత దంపతులతో పాటు మరో ముగ్గురు ఆమె డ్రైవర్ శ్రీనివాసులును హత్యచేశారని ఆరోపణలు ఎదుర్కొంటున్నారని అయితే మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి కొంతమంది పెయిడ్ ఆర్టిస్టుల ద్వారా ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డిపై ఆరోపణలు చేయించడం తగదని టీడీపీ నాయకులు సోమవారం సీఐ శ్రీకాంత్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. అలాంటివారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పొన్నారావు, ధనంజయులునాయుడు, మోహన్‌రావు, శివశంకర్‌రెడ్డి, గురవా రెడ్డి, నాగరాజునాయుడు, గుణ యాదవ్,కుక్క రమణ తదితరులు పాల్గొన్నారు.

జనం నమ్మరు

కోట వినుత,చంద్రబాబు దంపతులు ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డిపైచేసిన ఆరోపణలను జనం నమ్మే పరిస్థితిలో లేరని టీడీపీ ఏర్పేడు నాయకులు స్పష్టం చేశారు. ఏర్పేడులో నిర్వహించిన విలేకరుల సమావేశంలో టీడీపీ నాయకులు పొన్నారావు, ధనంజయులునాయుడు, శివశంకర్‌రెడ్డి, మోహన్‌రావు, నాగరాజునాయుడు, గురవారెడ్డి మాట్లాడారు.

తప్పుడు వార్తలను ప్రచారం చేస్తున్నవారిపై చర్యలు తీసుకోండి

శ్రీకాళహస్తి, జూలై 14(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డిపై రెండురోజులుగా సామాజిక మాధ్యమాల ద్వారా తప్పుడు వార్తలను ప్రచారం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని టీడీపీ నాయకులు కోరారు. సోమవారం డీఎస్పీ నరసింహమూర్తిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ నాగమల్లి దుర్గాప్రసాద్, బాలాజీరెడ్డి, ఖాదర్,వినయ్‌కుమార్, సాయి, చందు, బాలాజీ, గిరి పాల్గొన్నారు.

కఠిన చర్యలు తీసుకోండి: టిడిపి

రేణిగుంట జూలై 14(ఆంధ్రజ్యోతి) శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డిపై సోషల్ మీడియాలో అసత్య ప్రచారం చేస్తున్న వారిపై కేసు నమోదు చేయాలని స్థానిక టీడీపీ నాయకులు డీఎస్పీ శ్రీనివాసరావుకు పిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల, పట్టణ అధ్యక్షులు మునిచంద్రారెడ్డి, మహబూబ్ బాషా, నాయకులు సుబ్రహ్మణ్యంరెడ్డి, మండల కార్యదర్శి సిటీ సుబ్రహ్మణ్యం, తదితరులు పాల్గొన్నారు.

మారేడుకాలువ వంతెన నిర్మించండి



కలెక్టరేట్ వద్ద ఏఐవైఎఫ్ నాయకులు

వరదయ్యపాళెం, జూలై 14(ఆంధ్రజ్యోతి): వరదయ్యపాలెం గోవర్థనపురం వద్ద ఉన్న మారేడు కాలువ వంతెనను త్వరితగతిన నిర్మించాలని ఏఐవైఎఫ్ నాయకులు మురళి, నాగార్జున కోరారు. సోమవారం తిరుపతి కలెక్టరేట్‌లో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జేసీ శుభం బన్సల్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వరదయ్యపాళెం జడ్పీ ఉన్నత పాఠశాలలో నాబార్డు నిధుల కొరతతో ఆగిన తరగతి గదుల పునఃప్రారంభించాలన్నారు. పాండూరు పంచాయతీలోని వ్యవసాయ పంట కాలువలను ఆక్రమణ నుంచి కాపాడాలన్నారు. వెంకటేశ్వర ఎస్టీకాలనీవాసులకు శ్మశాన వాటిక ఏర్పాటుచేయాలని కోరారు. మండలంలో అర్హులైన ఇల్లు లేని పేదలకు ఇళ్ల మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రతాప్, పోలయ్య తదితరులు పాల్గొన్నారు.

హోరాహోరీగా క్రికెట్ పోటీలు



విజేత జట్టుకు ట్రోఫీని అందజేస్తున్న దృశ్యం

వరదయ్యపాళెం, జూలై 14(ఆంధ్రజ్యోతి): వరదయ్యపాళెం మండల తొండూరులో క్రికెట్ పోటీలు హోరాహోరీగా సాగాయి. టీడీపీ నాయకుడు కేఎస్ఎం విష్ణు ఆధ్వర్యంలో ఈ పోటీలను నిర్వహించారు. సుమారు 15జట్లు ఈ పోటీల్లో పాల్గొన్నాయి. తుదిపోరుకు రూల్స్ బ్రేకర్స్‌పేట జట్టు, టీసీసీ తొండూరు జట్టు తలపడ్డాయి. రూల్స్‌బ్రేకర్స్ పేట జట్టు విజేతగా నిలిచి రూ.20వేలు, ట్రోఫీ గెలుచుకుంది. రెండవ స్థానంలో నిలిచిన టీసీసీ తొండూరు జట్టుకు రూ.15వేలు, ట్రోఫీ, మూడవ స్థానంలో నిలిచిన నాని 115 టీసీసీ జట్టుకు రూ.10వేలు, నాలుగవస్థానంలో నిలిచిన కొల్లమిట్ట సూళ్లూరుపేట జట్టు 5వేలు అందుకుంది. ఈ కార్యక్రమంలో తొండూరు సర్పంచ్ రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్ నిర్మాణానికి భూమిపూజ



భూమి పూజ నిర్వహిస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం

సత్యవేడు, జూలై 14 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో అన్న క్యాంటీన్ నిర్మాణానికి అడుగులు పడ్డాయి. స్థానిక ఆత్మ కార్యాలయం పక్కన ఉన్న ఖాళీ స్థలంలో అన్న క్యాంటీన్ నిర్మాణానికి సోమవారం ఎమ్మెల్యే ఆదిమూలం చేతుల మీదుగా భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రూ.61 లక్షలతో సత్యవేడులో అన్న క్యాంటీన్ నిర్మించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రాజశేఖర్, ఎంపీడీవో త్రివిక్రమరావు, ఎస్ఐ రామస్వామి, వెలుగు ఏపీఎం డాంగేయాదవ్, అగ్రికల్చర్ ఏవో మురళి, ఆర్ఐ సురేష్, సెక్రటరీ మునిరవికుమార్, నాయకులు సుబ్రమణ్యంరాజు, సంతోష్‌కుమార్, ప్రదీప్, ఇళంగోవన్ రెడ్డి, పద్మరాజు, జనసేన బాలమురళి కృష్ణ, అంబేడ్కర్ సంఘం మండల అధ్యక్షుడు వెంకటరమణ, అడ్వకేట్ రాజా పాల్గొన్నారు. ● అనంతరం దళవాయి అగ్రహారంలో నిర్వహించిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆదిమూలం పాల్గొన్నారు. ఇంటింటా కరపత్రాలను అందించారు.

'నా పొలాన్ని దున్నేశారు.. న్యాయం చేయండి'



కేవీబీపురం, జూలై 14(ఆంధ్రజ్యోతి): తన పొలాన్ని దున్నేశారని న్యాయం చేయాలని బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధుతుడి కథనం మేరకు.. మండలంలోని కోటమంగాపురం గ్రామంలో పయని అనే వ్యక్తి 2019లో అదే గ్రామానికి చెందిన మునస్వామి వద్ద సర్వే నెంబరు 160/2లో 2.62 ఎకరాల పొలం కొనుగోలు చేశాడు. రిజిస్టర్ చేయించుకున్నాడు. మునస్వామి మర ణించాడు. అయితే మునస్వామి కుమారుడు రాజేష్, తన చిన్నాన్న మునికృష్ణయ్య, తమ్ముడు సందీప్‌తో కలిసి పయన్ సాగు చేసిన సజ్జపంటను ట్రాక్టర్‌తో దున్నేశారు.

అమరరాజాలో పోలీసులకు ఉచిత వైద్య శిబిరం



వైద్య శిబిరాన్ని జ్యోతి వెలిగించి ప్రారంభిస్తున్న ఎస్పీ హర్షవర్ధన్‌రాజు, డాక్టర్ రమాదేవి

రేణిగుంట, జూలై 14(ఆంధ్రజ్యోతి): అమరరాజా గ్రూప్స్ అమరా హాస్పిటల్, కాంటినెంటల్ కాఫీ సంయుక్తంగా తిరుపతి జిల్లా పోలీస్ సిబ్బందికి ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. సోమవారం కరకంబాడిలో ఉన్న అమరరాజా ఆడిటోరియంలో జరిగిన ఈ వైద్య శిబిరాన్ని ఎస్పీ హర్షవర్ధన్‌రాజు, అమర హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రమాదేవి ప్రారంభించారు. ఈ మెగా వైద్య శిబిరానికి పెద్దఎత్తున జిల్లాలోని పోలీసు అధికారులు, సిబ్బంది హాజరై వివిధ పరీక్షలను చేయించుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీసులకు ఉచిత వైద్యం అందిస్తున్న అమరా హాస్పిటల్, కాంటినెంటల్ కాఫీ వారికి ధన్యవాదాలు తెలిపారు. మేనేజింగ్ డైరెక్టర్ రమాదేవి గౌరినేని మాట్లాడుతూ ప్రజా రక్షణలో పడి పోలీసులు తమ ఆరోగ్యాన్ని పట్టించుకోలేకపోతున్నారన్నారు. అలాంటి వారికి ఆరోగ్య శిబిరం ఏర్పాటు చేయడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు రవిమనోహరాచారి, చంద్రశేఖర్, డీఎస్పీ శ్రీనివాసరావు, ఎస్ఐలు, ఆర్ఐలు, తదితరులు పాల్గొన్నారు.